ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
మంగళవారం అక్టోబరు 15, 2024



పవన్ ఉండగా.. పల్లెకు పండగే..



కృష్ణా జిల్లాపై ఉపముఖ్యమంత్రి వరాల జల్లు

ఈనాడు, అమరావతి, కంకిపాడు, న్యూస్‌టుడే

కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న అనేక సుదీర్ఘ సమస్యలను 'పల్లెపండగ'లో భాగంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు. కంకిపాడులో సోమవారం జరిగిన 'పల్లెపండగ' కార్యక్రమం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాపై వరాల జల్లు కురిపించారు. కంకిపాడు సీహెచ్‌సీ ప్రహరీ, 11 అంతర్గత సీసీ రహదారులు, రెండు మినీ గోకులాలు, పునాదిపాడు గ్రామ పరిధిలో రెండు అంతర్గత రహదారుల నిర్మాణానికి పవన్ శంకుస్థాపన చేశారు. కంకిపాడు నుంచి గొడవర్రు మీదుగా రొయ్యూరు రహదారి పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్‌ను పవన్ ఆదేశించారు. ఎదురుమొండి, నాగాయలంక, గొల్లమంద, బ్రహ్మయ్యతోట తదితర లంక గ్రామాలకు అనుసంధాన రహదారులు లేక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీరుస్తామని తెలిపారు. ఈ గ్రామాల్లోని 8వేల మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా రహదారుల అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశారు. ★ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి మేరకు మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్‌ను పట్టాలెక్కించేందుకు కేంద్రంతో మాట్లాడి, త్వరలోనే కార్యాచరణ మొదలెట్టేలా చర్యలు తీసుకుంటామని పవన్ హామీ ఇచ్చారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో ప్రజలు తాగుతున్న జలాలు పసుపు పచ్చగా ఉన్నాయంటూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పవన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ మంచి నీటి బాటిళ్లను పవన్ సభలో చూపిస్తూ.. ఈ సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ★ కంకిపాడు, పునాదిపాడు, ఈడుపుగల్లు, గోసాల, ఉప్పలూరు తదితర కూడళ్లలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. ★ ఉదయం వర్షం రావడంతో 'పల్లె పండగ' నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తమైంది. అయితే సభా కార్యక్రమాలు ముగిసే వరకు వర్షం పడలేదు. ★ పవన్ ప్రసంగిస్తున్న సమయంలో సభ మొత్తం కరతాళ ధ్వనులతో మారుమోగింది. యువత, మహిళలు భారీగా తరలివచ్చారు. డిజిటల్ తెరపై పవన్ కనిపించిన ప్రతిసారీ అభిమానులు పూల వర్షం కురిపించారు. ★ ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ డి.కె.బాలాజీ తదితరులు పవన్‌కు జ్ఞాపిక అందజేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆంజనేయస్వామి కాంస్య విగ్రహాన్ని పవన్‌కు అందజేసి సత్కరించారు.

ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఆయన కుమారుడు వెంకట్రామ్



నీరు రంగు మారి వస్తోందని పవన్‌కు చూపిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

మహాత్ముడి స్ఫూర్తితోనే..

– ఎంపీ వల్లభనేని బాలశౌరి



గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందినేతే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయన్న మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకుని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పల్లెపండగ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా ఒక్క రోజులోనే 13,326 పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించాం. గత ప్రభుత్వంలో దాదాపు 3వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడితే ఆ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున తన సొంత డబ్బులను పవన్ ఇచ్చారు. ఇటీవల కురిసిన వరదల కారణంగా 400 గ్రామాల్లో నష్టం జరిగితే ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున రూ.4 కోట్లు సొంత డబ్బులు అందించారు. గత ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చిన జలజీవన్ మిషన్ నిధులు సక్రమంగా వినియోగించుకోలేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవస్థలు తప్పడం లేదు. ఆ నిధులు సద్వినియోగం చేసుకుని మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుస్తాం. కృష్ణా జిల్లావాసుల చిరకాల కోరిక మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను ప్రాజెక్టును త్వరలోనే సాకారం చేస్తాం.

వైకాపా పాలనలో సర్పంచులు రోడ్డపాలు

– కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ మంత్రి



గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రహదారులు వేయించిన సర్పంచులు, గుత్తేదారులు సకాలంలో బిల్లులు రాకపోవడంతో రోడ్డు పాలయ్యారు. వారి ఆస్తులను అమ్ముకునే పరిస్థితికి వచ్చారు. పంచాయతీ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసుకున్నారు తప్ప గ్రామాల్లో అభివృద్ధి పనులకు నోచుకోలేదు. కేంద్రం గ్రామాలకు విడుదల చేసిన రూ.12వేల కోట్లు సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రూ.4,500 కోట్లతో 30వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 3వేల కి.మీ సీసీ రోడ్లు, 500 కి.మీ తారు రోడ్లు, 10వేల వాననీటి కుంటలు నిర్మిస్తున్నాం.

మాచవరం వద్ద కుంగిన రైల్వే ట్రాక్

పొన్నూరు, బాపట్ల, గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: చెన్నై నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల రైల్వే ట్రాక్ ఒక వైపు కుంగింది. రెండు రోజులు నుంచి వర్షాలు కురవడంతో అక్కడ ప్రమాదకరంగా ఉంది. ఆ మార్గంలో రాకపోకలు నిర్వహించే రైళ్లను అతి తక్కువ వేగంతో కొనసాగిస్తున్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతుల ప్రక్రియను చేపట్టగా.. ఈ పనులకు వర్షం అడ్డంకిగా మారింది. మాచవరంలో సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో సోమవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అక్కడ నిలిచిపోయింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వందే భారత్ రైలును అప్పటికప్పుడు వెనుకకు పంపించారు. అప్పటికు నిడుబ్రోలు వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాక్‌పై వందేభారత్ రైలును పంపారు. అదే ట్రాక్‌లో మిగిలిన రైళ్లను పంపిస్తున్నారు. ఆ మార్గంలో రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే





ఘాట్‌రోడ్డు వద్ద అమ్మవారికి నమస్కరిస్తూ..



తరలివస్తున్న భవానీలు

జై భవానీ..

దీక్షాధారులతో ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లు రద్దీ

దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగిసినా ఇంద్రకీలాద్రిపై జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భవానీ దీక్షాధారుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మరో రెండు రోజులు భవానీ దీక్షాధారులు అమ్మవారి దర్శనానికి వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఇరుముడి సమర్పించిన భక్తులకు అవసరమైన ప్రసాదాలను కౌంటర్లలో సిద్ధం చేశారు. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్‌లో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కనకదుర్గానగర్‌కు చేరుతున్నారు. కనకదుర్గానగర్‌లో అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు ప్రసాదాల కౌంటర్ల వద్ద బారులు తీరుతున్నారు.

కౌంటర్లు పెంచాలి

మూలానక్షత్రం నాటి నుంచి ఉత్సవాలు ముగిసేవరకు భక్తుల రద్దీ కొనసాగుతుండడంతో ప్రసాదాల కౌంటర్లు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 11 లడ్డూ విక్రయ కేంద్రాలు మాత్రమే కనకదుర్గానగర్‌లో ఉన్నాయి. ఇవికాకుండా పలు ప్రాంతాల్లో కేంద్రాల ద్వారా నామమాత్రంగా విక్రయించారు.

దసరా ఉత్సవాల్లో రికార్డు స్థాయిలో లడ్డూ విక్రయాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల్లో రికార్డు స్థాయిలో సుమారు 25 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయాలు జరిగాయి. మరో రెండు లక్షలు విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయి. వేడుకలు ముగిసిన తర్వాత కూడా భవానీ దీక్షాధారుల రద్దీ కొనసాగుతుండటంతో ప్రసాదాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఉత్సవాల్లో దాదాపు 15 లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది 15 రోజుల్లో 20 లక్షల లడ్డూ ప్రసాదాలు విక్రయించగా ఈ సారి ఆ సంఖ్య 27 లక్షలకు చేరింది.



కనకదుర్గా నగర్‌లో భక్తుల తాకిడి



అమ్మవారికి నివేదన సమయంలో క్యూలైన్లలో నిరీక్షణ

ఈనాడు, అమరావతి

సిండికేట్లదే హవా!

- కూడబలుక్కొని దరఖాస్తు చేసి దక్కించుకున్నారు
- సరిహద్దు మండలాల్లో తెలంగాణ వ్యాపారులకే అధికం
- లాటరీ దక్కించుకున్న వారితో పలువురు జోరుగా బేరసారాలు
- మహిళలకూ పెద్ద సంఖ్యలో వచ్చిన దుకాణాలు

మద్యం దుకాణాలకు తీసిన డ్రాలో సిండికేట్లదే పైచేయి అయింది. దరఖాస్తుల సమర్పణ నుంచే వీరి హవా కనిపించింది. వీరే ఎక్కువ చోట్ల షాపులు దక్కించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నోటిఫై చేసిన మద్యం దుకాణాలకు సోమవారం విజయవాడలోని ఎస్‌ఏసీ కల్యాణ మండపంలో డ్రా తీశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం వరకు సాగింది. రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లాలోని 113 దుకాణాలకు 5,825 మంది దరఖాస్తు చేశారు. దీంతో రెండు హాల్స్‌లో డ్రా తీశారు. మొదటి హాల్‌లో కలెక్టర్ సృజన, రెండో హాల్‌లో జేసీ నిధి మీనా స్వయంగా డ్రా తీశారు. ఈ హాల్‌లో తెలంగాణ సరిహద్దున ఉన్న ప్రాంతాలు ఉండడం, వాటిలో ఎక్కువ దరఖాస్తులు రావడంతో ప్రక్రియ ఆలస్యమైంది. లక్కీ డిప్‌లో షాపు దక్కించుకున్న దరఖాస్తుదారులు వార్షిక రుసుములో ఆరో వంతు చెల్లించేందుకు వీలుగా ప్రాంగణంలోనే ఎస్‌బీఐ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. డ్రాలో అదృష్టం వరించిన వారు ఆనందంతో కేరింతలు కొట్టారు.



దుకాణాల కేటాయింపునకు హాజరైన మహిళలు

షాపు వదిలేస్తే రూ.కోటి

సిండికేట్‌తో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకుని దుకాణాలు దక్కించుకున్నవారి నుంచి చేజిక్కించుకునేందుకు జోరుగా బేరసారాలు సాగాయి. సాక్షాత్తు డ్రా తీసిన కల్యాణ మండపంలోనే వాటిని మొదలుపెట్టారు. ఒక్కరే అంత పెట్టుబడి పెట్టలేరు.. మాకు వదిలేస్తే గుడ్‌విల్ కింద డబ్బులు ఇస్తామని బుజ్జగిస్తున్నారు. ఇప్పటికిప్పుడు షాపుల కోసం ప్రాంగణం చూసుకోవడం, సరకు, పెట్టుబడి, తదితర వాటికి రూ.40లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంత స్థోమత లేని వారు సిండికేట్ల ఆఫర్లకు తలొగ్గుతున్నారు. షాపు వదిలిస్తే రూ.కోటి నుంచి 1.2 కోట్ల వరకు ముట్టజెబుతామని అటు విజయవాడ నగరం మొదలు గ్రామీణ ప్రాంతాల్లో షాపులు దక్కించుకున్న వారికి ఆశ చూపుతున్నారు. కొందరైతే దరఖాస్తుదారు చెల్లించిన రూ.2లక్షల రుసుముతో పాటు లైసెన్సు ఫీజులో పది శాతాన్ని చెల్లిస్తామని నచ్చజెబుతున్నారు.



మద్యం దుకాణాల లాటరీ తీస్తున్న కలెక్టర్ సృజన

రింగ్ అయి.. షాపులు దక్కించుకుని..

★ దుకాణాలు దక్కించుకునేందుకు ఎక్కువ మంది సిండికేట్ అయి దరఖాస్తు చేసుకున్నారు. పెట్టుబడి, వాటాలకు సంబంధించి ముందే అవగాహనకు వచ్చి కూడబలుక్కున్నారు. విజయవాడ నగరంలో 39 దుకాణాలను నోటిఫై చేశారు. వీటిలో దాదాపు 25 షాపులను ఐదు సిండికేట్లు దక్కించుకున్నాయి. వీరిలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు, కీలక నేతల అనుచరులే. నగరంలోని ఓ నియోజకవర్గంలోని డివిజన్ స్థాయి ప్రజాప్రతినిధి కొందరిని రింగ్ చేశారు. వీరంతా కలిసి 154 షాపులకు దరఖాస్తు చేసుకోగా, ఐదు వచ్చాయి. మరో నియోజకవర్గంలో డివిజన్ ప్రజాప్రతినిధి ఒకరు కొందరితో కూటమి కట్టి 250 షాపులకు వేయగా 5 దుకాణాలు దక్కాయి. గుంటూరు జిల్లాకు చెందిన భార్యభర్తలు.. నగరానికి చెందిన వారితో కలిసి 480 షాపులకు దరఖాస్తు చేశారు. ఈ సిండికేట్‌కు 9 వచ్చాయి. నగరంలోని మరో కూటమి 300 పైగా షాపులకు దరఖాస్తు చేస్తే 5 దక్కాయి. ఒక్కొక్కరు ఎన్ని షాపులకైనా వేయొచ్చన్న నిబంధన ఉండడంతో ఒక్కో దానికి రూ.2లక్షలు చెల్లించి చాలా దరఖాస్తులు వేశారు. కొందరికి రెండు, మూడు కూడా డ్రాలో దక్కాయి.

మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరికి.. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా ఎన్టీఆర్ జిల్లాలోని షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ నగరంలోని ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి విజయవాడలోని రెండు దుకాణాలు లాటరీలో వచ్చాయి. బెజవాడలోని 14వ దుకాణం.. రాహుల్ శివహరేకు, 18వ దుకాణం.. అర్పిత్ శివహరేలను వరించాయి.

20షాపులు మహిళలవే.. జిల్లాలోని 113 దుకాణాలకు మహిళలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేశారు. డ్రాలో షాపులు పొందిన వారిలోనూ ఇంతులు గణనీయమైన సంఖ్యలోనే ఉండడం విశేషం. రాష్ట్రంలోకెల్లా ఎన్టీఆర్ జిల్లా 2వ స్థానంలో ఉంది. మొత్తం 20 మందికి లాటరీలో దుకాణాలు వచ్చాయి. 17.7 శాతం మహిళలకే దక్కాయి.



విజయవాడ గురునానక్ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల కేటాయింపు వద్దకు తెలంగాణ రాష్ట్రం వరంగల్ నుంచి నెలల చిన్నారిని వెంట బెట్టుకుని వచ్చిన ఓ కుటుంబం



లాటరీ నిర్వహించే హాలుకు లైనులో వెళ్తూ..

తెలంగాణ కంటే ఇక్కడ లాభసాటని..

★ తెలంగాణలోని సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారు భారీ సంఖ్యలో దరఖాస్తులు చేశారు. మైలవరం, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, మైలవరం, తిరువూరు, కంచికచర్ల, గంపలగూడెం, విస్సన్నపేట, తదితర మండలాలకు స్థానికేతరుల హవా కనిపించింది. పెనుగంచిప్రోలులోని ఐదు దుకాణాల్లో మూడు తెలంగాణకు చెందిన వారికే వచ్చాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా వత్సవాయిలోని 96వ దుకాణానికి 132 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఖమ్మం జిల్లాకు చెందిన సత్యనారాయణను లాటరీ వరించింది. 97వ దుకాణానికి 120 దరఖాస్తులు రాగా డ్రాలో రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన బండి అనూషా దక్కించుకున్నారు. జిల్లాలో దరఖాస్తుల్లో మూడో స్థానంలో ఉన్న పెనుగంచిప్రోలులోని 81వ దుకాణం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన రాజును వరించింది.

ఎన్టీఆర్ జిల్లాకు ఆనుకుని ఉన్న సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో ఇప్పటికే మద్యం దుకాణాలు నడుపుతున్న వారు ఎక్కువగా ఆసక్తి చూపించారు. తెలంగాణలో సంబంధిత దుకాణం లైసెన్సు ఫీజుకు పది రెట్లు సరకును ఇస్తారు. ఈ పరిమితి దాటిన తర్వాత ఇచ్చే సరకుపై అక్కడి ప్రభుత్వం పన్ను విధిస్తుంది. రోజుకు రూ.5లక్షలకు వ్యాపారం చేస్తే కానీ గిట్టుబాటు కానీ పరిస్థితి. ఏపీలో ఇలా పరిమితులు లేకపోవడంతో ఇక్కడి షాపులను దక్కించుకునేందుకు ఆసక్తి చూపించారు.

వరదతో విధ్వంసం.. చౌరవతో పరిష్కారం



కవులూరు వెళ్లే మార్గ మధ్యలో పెద్ద గండి



రాళ్లు, మట్టితో పూర్తిగా పూడ్చి మార్గం చూపి..

బుడమేరు సృష్టించిన విధ్వంసం వల్ల ఇబ్రహీంపట్నం నుంచి కవులూరు వెళ్లే రోడ్డు కోతకు గురై నెల రోజులు తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజానీకం నేడు కుదుటపడింది. శాంతినగర్ నుంచి కవులూరు, పైడూరుపాడు, రాయనపాడును కలిపే ప్రధాన రహదారి గండిపడిన చోటుకు అత్యంత సమీపంలోనే ఉంది. వరద ఉద్ధృతికి పలుచోట్ల పెద్దపెద్ద గండ్లు పడి రోడ్డు మొత్తం కోతకు గురైంది. దీంతో ఇబ్రహీంపట్నం వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వరద వచ్చి నెల రోజులు గడవక ముందే పెద్దపెద్ద గండ్లను రాళ్లు మట్టితో పూడ్చివేసి ప్రజానీకానికి ఇబ్బందులు లేకుండా చేసింది.

-ఈనాడు, అమరావతి



శాంతినగర్ బ్రిడ్జి దిగువన భారీ గండి..



గండిని పూడ్చేసి.. రోడ్డు వేశారిలా..

ఫ్లెక్సీలు తొలగిద్దాం.. స్వచ్ఛ జగ్గయ్యపేటకు సహకరిద్దాం

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పర్యావరణానికి, పట్టణ సుందరీకరణకు అవరోధంగా మారిన ఫ్లెక్సీలను ఎవరికి వారు తొలగించి స్వచ్ఛ జగ్గయ్యపేటకు సహకరించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇచ్చిన పిలుపును ఆయన స్వాగతిస్తూ జగ్గయ్యపేట పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగుల తొలగింపును ఆయన సోమవారం ప్రారంభించారు. ముందుగా తన అనుచరులు తన ఫొటోలతో పెట్టిన దాన్ని స్వచ్ఛందంగా తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీధుల అందాన్ని, ప్రశాంతతను భంగపరిచే స్థాయిలో పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే ఫ్లెక్సీ ఫ్రీ పట్టణంగా జగ్గయ్యపేటను తీర్చిదిద్దుదామన్నారు. నెల్లూరును పోస్టర్ ఫ్రీగా మారుస్తున్న మంత్రి నారాయణను స్ఫూర్తిగా తీసుకుందామని, అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు తమ బ్యానర్లను తొలగించాలని సూచించారు. దశలవారీగా ఫ్లెక్సీలు, బోర్డులు, హోర్డింగులు, పోస్టర్ల తొలగింపు చేపడతామని మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. ప్రస్తుతం దీపావళి శుభాకాంక్షల ఫ్లెక్సీలు వరకూ ఉంచి మిగిలినవన్నీ తొలగిస్తామన్నారు. ఏదైనా ప్రకటనల నిమిత్తం బ్యానర్లు ఏర్పాటు చేయలనుకున్నవారు విధిగా పురపాలక సంఘం అనుమతి తీసుకుని, వారు సూచించిన స్థలాల్లో మాత్రమే పెట్టాలని కమిషనర్ రామ్మోహనరావు తెలిపారు.



తన అనుచరులు పెట్టిన ఫ్లెక్సీనే ముందుగా తొలగించమని చెప్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

చంద్రబాబు హయాంలోనే పారిశ్రామికాభివృద్ధి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అమేయ ప్రభు అన్నారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఎంఓయూ కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలను ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం మార్చుకున్నారు. అమేయ ప్రభు మాట్లాడుతూ ఏపీలో ఉత్పత్తయ్యే వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు మాట్లాడుతూ దేశంలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయాలన్నారు. చైనా, జపాన్, అమెరికా వంటి దేశాలు ప్రగతి పథంలో దూసుకెళ్లేందుకు ప్రధాన కారణం ఎంఎస్ఎంఈల సహకారమేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించడమే కాకుండా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి మంచి సహకారం అందిస్తోందని తెలిపారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకయైన ఎంఎస్ఎంఈ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ సింగ్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, కోశాధికారి అక్కయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న భాస్కరరావు, అమేయ ప్రభు. చిత్రంలో సురేష్ ప్రభు, గంగరాజు

సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం

విద్యాధరపురం, న్యూస్‌టుడే : పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ శాఖలతో పాటు ఇతర విభాగాల సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం అయ్యాయని నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు అన్నారు. దసరా ఉత్సవాలు ముగింపు నేపథ్యంలో వన్ టౌన్ పోలీసు స్టేషనులో దుర్గగుడి రుత్వికులు సోమవారం చండీహోమం నిర్వహించారు. అనంతరం చేపట్టిన అన్నప్రసాద వితరణను దుర్గగుడి ఈవో రామారావు, డీసీపీ గౌతమిషాలితో కలిసి సీపీ ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ రానంతగా దేవీ నవరాత్రి ఉత్సవాలకు దాదాపు 15 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. మూలా నక్షత్రం తర్వాత కూడా సాధారణ భక్తులతో పాటు గణనీయంగా భవానీ దీక్షాధారులు రావడంతో పరిస్థితులు అదుపు తప్పకుండా సుమారు ఆరు వేల మంది సిబ్బంది భద్రతా విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయ పరిచామని చెప్పారు. ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.


పూర్ణాహుతి కార్యక్రమంలో సీపీ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో రామారావు, డీసీపీ గౌతమిషాలి

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ -228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

జగన్మాత సేవలో రక్షణ శాఖ సలహాదారు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను కేంద్ర రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో రామారావు ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


సతీష్‌రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

వరద బాధితులకు దాతల చేయూత


చంద్రబాబుకు రూ.8 లక్షల చెక్కు అందిస్తున్న రాజధాని రైతులు, మహిళలు

ఈనాడు, అమరావతి, తుళ్లూరు, న్యూస్‌టుడే: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాల ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు దాతలు పెద్దఎత్తున స్పందిస్తున్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తలు, వివిధ సంస్థలు సేకరించిన రూ.30.85 లక్షల చెక్కును ఆ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, తదితరులు సోమవారం వెలగపూడి సచివాలయంలో చంద్రబాబుకు అందజేశారు. రాజధాని పరిధిలోని తుళ్లూరు గ్రామస్థులు రూ.8 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు చంద్రబాబును కలిసి చెక్కు అందించారు.

పేరు	విరాళం మొత్తం (రూ..)
విజయ్‌కుమార్	6 లక్షలు
ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్(ఏపీ సర్కిల్)	3.11 లక్షలు
ఎన్నారై టీడీపీ వింగ్ (న్యూజిల్యాండ్)	2.70 లక్షలు
మల్లంపాటి శ్రీనివాసరావు	2.50 లక్షలు
లక్ష్మీ సుభాషిణి	లక్ష
వెలంగ సరధ	లక్ష
మంచికలపూడి సుబ్బారావు	లక్ష
వెలంగ భాస్కర్	50 వేలు

వీరితోపాటు మరికొందరు విరాళాలు ఇచ్చారు.

మిద్దె తోట.. ఆరోగ్య బాట

రైతేరాజు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

ప్రస్తుతం మిద్దె తోటలకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్థలం కొరత నేపథ్యంలో మిద్దెలపై సేంద్రియ విధానంలో పంటలు పెంచేందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. ఆ కోవకు చెందినవారే విజయవాడ బాలాజీనగర్‌కు చెందిన ధవళేశ్వరపు నాగలక్ష్మి. ఆమె సొంతూరు ఆకివీడు. భర్త భాస్కరరావు బ్యాంకు మేనేజరు కావడంతో విజయవాడ వచ్చారు. 1987లో కాలనీలో స్థలం కొని ఇల్లు కట్టించుకున్నారు. కొంత భాగం పెరటిగా వాడారు. 2000లో ఆ స్థలంలో పనివాళ్ల కోసం షెడ్డు వేశారు. దాంతో పెరటి సాగు మిద్దె పైకి చేరింది. తాత నూకరాజు స్ఫూర్తితో సాగుపై దృష్టి పెట్టారు. అబ్బాయి, అమ్మాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో మొక్కల పెంపకానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.

దాబాపై అడుగు ఎత్తున ఇనుప చట్రాలు బిగించారు. వాటిపై కుండీలు పెట్టారు. ఇనుప పైపులు పెట్టి వాటికి పందిరిలా తీగలు చుట్టారు. కుండీల్లో మట్టి, ఎండిన ఆకులు, కూరగాయల వ్యర్థాలు పొరలు వేశారు. పది రోజుల తర్వాత వాటిలో మొక్కలు పెట్టి జీవామృతం, పంచగవ్యం, పిడకలు వేసి సరిపడా నీళ్లు పోస్తున్నారు. క్రిమికీటకాలు వాలకుండా, తెగుళ్లు రాకుండా మాగిన పండ్లు, బెల్లం తదితరాలతో తయారు చేసిన ద్రావణం, వేప నూనె, దశపత్ర కషాయాన్ని మొక్కలపై పిచికారీ చేస్తున్నారు. డ్రిప్ విధానంతో పురుగుల కట్టడి చేపడుతున్నారు.


మిద్దెపై పందిరి, కింద కుండీల్లో కాయగూరలు

పండించేవి ఇవే..

కాకర, సొర, పొట్ల, బీర, చిక్కుడు, దోస, తీగ బచ్చలి, వంగ, టమాటా, పచ్చిమిర్చి పండిస్తున్నారు. చామంతి, ఆస్టర్, మల్లి, సంపెంగ, అడీనియం, మందార, బంతి, గులాబీ, లిల్లీ పూల మొక్కలు వేశారు. కొండపిండాకు, తమలపాకులు, నేల వేము, బిళ్లగన్నేరు, గోంగూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, పొన్నగంటి కూర, బచ్చలి, కొత్తిమీర, కరివేపాకు సాగు చేస్తున్నారు. మామిడి, బత్తాయి, జామ, దానిమ్మ, ద్రాక్ష పండిస్తున్నారు. సేంద్రియ సాగుతో పండించిన కూరగాయలు, ఆకుకూరలతో ఆరోగ్యానికి మేలని ఆమె వివరిస్తున్నారు.

గ్రీన్‌హౌస్ సాగు చేస్తా



టీవీలు, ముచ్చట్లకు బానిస కాకుండా మొక్కలతో జీవనం ఆనందంగా ఉంటుంది. 'వన్ ఎర్త్.. వన్ లైఫ్' సంస్థ సహకారం తీసుకుంటున్నా. ఇటీవల 'ఇన్వైటెడ్ యువర్ కమిషనర్' కార్యక్రమానికి ఎంపికయ్యా. కమిషనర్ ఇచ్చిన రూ.పది వేలను ఆ సంస్థకే ఇచ్చేశాను. మిద్దె సాగుతో 1-2 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతుంది. సొంతంగా అంటుకట్టడం నేర్చుకొని ఒకే మొక్క నుంచి టమాట, వంగ పండిస్తా. గ్రీన్ హౌస్ సాగు చేయాలని ఉంది. 2011లో 'ఈనాడు-వసుంధర' నిర్వహించిన 'మాతృమూర్తుల...దీవెన' కార్యక్రమంలో ట్రోఫీతో పాటు రూ.15 వేల నగదు పురస్కారం అందుకున్నా. ఈ ఏడాది జనవరిలో విజయవాడ రోజ్ సొసైటీ నిర్వహించిన పోటీల్లో అవార్డు కైవసం చేసుకున్నా.

– నాగలక్ష్మి ధవళేశ్వరాపు



ప్రశ్న: టమాట పంటలో నీటి యాజమాన్యం, పచ్చదోమ నివారణ చర్యలు తెలపండి? – కె.శ్రీనివాసరావు, మల్లంపల్లి

సమాధానం: టమాట పంటను సంవత్సరం పొడవునా అన్ని రుతువుల్లో పండిస్తారు. అధిక దిగుబడికి శీతాకాలం అనువైనది. భూమిలో తేమను బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. వేసవిలో ప్రతి 5-6 రోజులకు ఒకసారి తడి అవసరం ఉంటుంది. పచ్చదోమ ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వలన ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపీ ఆకు ఎర్రబడి చివరగా ముడుచుకుని దోనెలాగ కనిపిస్తాయి. నివారణకు ఐమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

– ఘంటసాల, న్యూస్‌టుడే

ఈతల మధ్య అంతరాన్ని తగ్గిస్తే పాడి లాభదాయకం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ఏడాదికో దూడ లక్ష్యంతో పశుపోషణ లాభదాయకంగా ఉంటుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆ లక్ష్య సాధనకు అనుసరించాల్సిన పద్ధతులను ఇబ్రహీంపట్నం పశు వైద్యశాల వైద్యాధికారి మోహన్‌కృష్ణ వివరించారు.

★ పశుపోషణలో మంచి జాతులను ఎన్నుకోవడం, ఈతల మధ్య అంతరం తగ్గించుకోవడం, శాస్త్రీయ పద్ధతిలో సమీకృత దాణా, మేలైన పశుగ్రాసాలను వాడితే లక్ష్యాన్ని సాధించవచ్చు.

★ పశువు చూడితో ఉన్నప్పుడు ఏడో నెల నుంచి రోజూ రెండు కిలోల సమీకృత దాణా, 50 గ్రాముల మిక్చర్, 20 నుంచి 30 కిలోల సూపర్ నేపియర్ లాంటి మేలైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలి.

★ శుభ్రమైన వాతావరణంలో పెంచితే పశువు ఈనిన తర్వాత 45 రోజుల నుంచి 90 రోజుల వ్యవధిలో మొదటి ఎదకు వస్తుంది. అప్పుడు పొర్లిస్తే చూలు కట్టే అవకాశం 60 నుంచి 70 శాతం వరకు ఉంటుంది.

★ పశువు చూలు కట్టిన తరువాత ఏడెనిమిది నెలల వరకు ఉదయం సాయంత్రం 8 నుంచి 10 లీటర్ల పాలు ఇస్తుంది. ఏడాదికొక దూడ ఉత్పత్తి అవుతూ పశువు జీవితం కాలంలో (సుమారు 15 సంవత్సరాలు) ఎక్కువ పాలు ఉత్పత్తి చేస్తుంది. ఒక ఈతకు సుమారు రెండు వేల లీటర్ల పాల ఇచ్చే అవకాశం ఉంటుంది.



★ ఎక్కువ మంది పశు పోషకులు ఈతల మధ్య అంతరాన్ని ఒకటిన్నర సంవత్సరాల నుంచి రెండున్నర సంవత్సరాలుగా చూస్తున్నారు. ఫలితంగా పాడి నష్టదాయకంగా మారుతోంది. ఈతల మధ్య అంతరాన్ని ఆవుల్లో సంవత్సరానికి, గేదెల్లో 15 నెలలకు తగ్గించుకోవచ్చు. పై సూచనలు, యాజమాన్య పద్ధతులు పాటించి పశుపోషణ చేసుకున్నట్లయితే పాడి లాభదాయకంగా ఉంటుంది.

రూ.300 కోట్ల విలువైన స్థలాన్ని కాపాడండి

ఎస్సారార్ పూర్వ విద్యార్థుల సంఘం డిమాండ్

మాచవరం, న్యూస్‌టుడే : ఆక్రమణల చెరలో ఉన్న రూ.300 కోట్ల విలువైన 6.67 ఎకరాల స్థలాన్ని కాపాడాలని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు, గులాబీతోటలోని సదరు స్థలాన్ని సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. సంఘ నాయకుడు దోనేపూడి శంకర్ విలేకర్లతో మాట్లాడారు. విలువైన స్థలం కబ్జాకు గురవుతున్నా కళాశాల యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పదేళ్లుగా పోరాడుతున్నా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని 2009లో కోర్టు ఆదేశించిందన్నారు. ఆ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఎలా కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ ఎలా అనుమతులిస్తుందని నిలదీశారు. దసరా పండగ సందర్భంగా కొందరు ప్రైవేటు వ్యక్తులు శంకుస్థాపనకు సిద్ధమవుతుండగా.. కలెక్టర్ జి.సృజన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమె స్పందించి, పనులు నిలిపివేయించారని చెప్పారు. 'ఆపరేషన్ బుడమేరు' తరహాలో 'ఆపరేషన్ ఎస్సారార్' చేపట్టాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కళాశాలకు 87 సంవత్సరాల చరిత్ర ఉందని వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు దోనేపూడి కాశీనాథ్, చెరుకూరి కృష్ణకుమార్ (నాని), అధ్యక్షుడు లంకా జానయ్య, కార్యదర్శి చిగురుపాటి యుగంధర్‌లు మాట్లాడారు. ఎన్టీ రామారావు, చలసాని శ్రీనివాసరావు, చలసాని కాంచనరావు, రావి భీమారావు వంటి అనేక మంది ప్రముఖులు కళాశాలలో చదువుకున్నారని గుర్తు చేశారు. ఒక దశలో.. నగరపాలక సంస్థలో 12 మంది కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారని తెలిపారు. రాజకీయ చైతన్యం గల కళాశాల స్థలాన్ని కబ్జా చేస్తే.. ఊరుకునేది లేదని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. జలసూత్రం శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమించిన స్థలంలో మెరక వేసేందుకు వచ్చిన ట్రాక్టర్‌ను నేతలు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆళ్ల వేణుగోపాలరావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, కె.వి.నాంచారయ్య, న్యాయవాదులు శ్రీనివాసరావు, రాజశేఖర్, మహబూబ్ ఆజం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.కార్తిక్, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


స్థలంలో మెరక వేయడానికి వచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

ఎండీఎస్ 'స్పెషల్ స్ట్రే' ఖాళీలకు ఆప్షన్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : ఈ విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో మొదటి, రెండో, మూడో స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్‌ల అనంతరం మిగిలిన ఎండీఎస్ కన్వీనర్, యాజమాన్య సీట్ల ప్రవేశానికి ఆప్షన్లు పెట్టుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం ప్రకటన జారీ చేసింది. తగ్గించిన కటాఫ్ మార్కులతో అర్హత కలిగిన అభ్యర్థులు ఈ సోమవారం (14వ తేదీ)రాత్రి 8 గంటల నుంచి 16వ తేదీ రాత్రి 8 గంటల వరకు ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. కన్వీనర్ కోటా కింద మొత్తం 29 సీట్లను అందుబాటులో ఉంచగా, యాజమాన్య కోటా సీట్ల కింద 43 సీట్లను సీట్ మ్యాట్రిక్స్‌లో పొందుపర్చారు. అభ్యర్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలంటే 89787-80501, 79977-10168కు ఫోన్ చేయవచ్చు.

కానిస్టేబుళ్లకు గాయాలు

బందోబస్తుకు వెళ్తుండగా ప్రమాదం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జూపూడి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. అజిత్‌సింగ్‌నగర్, పటమట పోలీస్‌స్టేషన్లలో పనిచేసే కోటేశ్వరరావు, కృష్ణలకు వత్సవాయి వద్ద దసరా ఉత్సవాల బందోబస్తు విధులు వేశారు. సోమవారం వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై వత్సవాయి నుంచి విజయవాడకు వస్తున్నారు. జూపూడిలోని సెవంత్ డే స్కూలు వద్దకు రాగానే.. రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టారు. వీరిద్దరికీ బలమైన గాయాలయ్యాయి. వెంటనే వీరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. నగరానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న వత్సవాయికి బందోబస్తు నిమిత్తం విజయవాడ నుంచి సిబ్బందిని పంపించడంపై పోలీస్ వర్గాల నుంచి ఒకింత వ్యతిరేకత వ్యక్తమైంది.

'బాధిత రైతులకు రుణమాఫీ చేయాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఈ ఏడాది పంట రుణాలు తీసుకున్న వరద బాధిత రైతులకు రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంద, పసుపు రైతులకు ప్రభుత్వ సహాయం ఎకరానికి రూ.14వేల చొప్పునే అందిందని చెప్పారు. వాస్తవానికి ఖర్చు ఇంకా ఎక్కువైందని పేర్కొన్నారు. భూ యజమానుల సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. లంక భూములు, ఇతర భూముల్లో పేరుకుపోయిన ఇసుక, బురద, మట్టిని ప్రభుత్వ వ్యయంతోనే తొలగించాలని డిమాండ్ చేశారు. తిరిగి పంటలు వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు, రుణ సదుపాయం కల్పించాలన్నారు. రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 29న వ్యవసాయ రంగం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో లేపాక్షి నాలెడ్జ్ పార్క్, కడపలో బ్రాహ్మణి స్టీల్, విమానాశ్రయం కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించారని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వానికి భూములు అవసరం లేకపోతే రైతులకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ.. ఈ ఏడాది వరద బాధితుల్లో వాస్తవ పంట సాగుదారులైన కౌలు రైతులకు నష్టపరిహారం అందలేదని పేర్కొన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సర్వేలో కౌలు రైతులను నమోదు చేయకుండా.. సాగుచేయని, పెట్టుబడి పెట్టని భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు డి.హరనాథ్, ఎం.వెంకటరెడ్డి, ఎం.హరిబాబు, యు.వీరబాబు, చల్లపల్లి విజయ, మరీదు ప్రసాద్‌బాబు, కోగంటి ప్రసాద్, కోటయ్య, కాసాని గణేష్ బాబు, జి.వి.రంగారెడ్డి, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు. పక్కన కేశవరావు, ఈశ్వరయ్య, జమలయ్య తదితరులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మూడు ఆలయాల్లో కానుకల లెక్కింపు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలో మూడు దేవాలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ అధికారులు సోమవారం లెక్కించారు. ఆరు నెలల కాలానికి సంబంధించి వేంకటాచల స్వామి దేవస్థానానికి రూ. 3,00,425, రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ. 58 వేలు, చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానానికి రూ. 41,097 ఆదాయం లభించినట్లు ఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. దేవాదాయ శాఖ గన్నవరం తనిఖీ అధికారిణి కె. అనూరాధ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మద్యం దుకాణాల కేటాయింపు పూర్తి

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని 10 మద్యం దుకాణాలకు సంబంధించిన లాటరీ ప్రక్రియలో దుకాణాల కేటాయింపు పూర్తి చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్ తెలిపారు. మైలవరంలో నాలుగు దుకాణాలను జి.పి.నాగరాజు, వీర మణి ఏలేరు, ధనేకుల శ్రీకాంత్, చారుగుండ్ల ప్రసాద్‌లు, జి. కొండూరు మండలంలోని నాలుగు దుకాణాలను కె.అంజిరెడ్డి, రావి పూడి శ్రీనివాసరావు, పలగాని సూర్యగౌడ్, అంత్యం సుబ్బరాజు లకు, రెడ్డిగూడెం మండలంలోని రెండు దుకాణాలను గుర్రాల శ్రీనివాసరెడ్డి, తురక అంకరాజు తదితరులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. నూతన దుకాణాలను ఈ నెల 16 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? మైలవరం శాంతినగర్ ఏరియాలో పంచాయతీ నీటి సరఫరా జరగక ఇబ్బందిగా ఉంది. పైపులైను మరమ్మతులు చేయాల్సి ఉంది. **- వెంకటేశ్వరరావు, మైలవరం**

✔ ప్రతిపాదనలు పూర్తి చేశాం. త్వరలోనే నూతన పైపు లైను వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
- ఎండీ రఫీ, పంచాయతీ కార్యదర్శి
– న్యూస్‌టుడే, మైలవరం

? కొండపల్లి బ్యాంకు కూడలి రాయల్ స్టూడియో ఎదురుగా రహదారి ధ్వంసమైంది. దీంతో నిత్యం అనేక మంది ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు.
- రాంబాబు, స్థానికుడు

✔ సిమెంటుతో దానిని సరి చేయిస్తాం.
- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ
– న్యూస్‌టుడే, కొండపల్లి

గ్రామాల్లో అభివృద్ధి పండగకు శ్రీకారం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రెడ్డిగూడెం మండలంలో 10,098 మీటర్లు పొడవునా రహదారి అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు మంజూరైనట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. సోమవారం రెడ్డిగూడెం మండలంలో 'పల్లె పండగ' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పలు గ్రామాల్లో రహదారులు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముచ్చనపల్లి, మద్దులపర్వ, అన్నేరావుపే, రెడ్డిగూడెం, రంగాపురం, నాగులూరు, రుద్రవరం గ్రామాల్లో రహదారులు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.



అన్నేరావుపేట గ్రామంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, పక్కన నాయకులు

ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), రెడ్డిగూడెం తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, నాయకులు కె.విజయబాబు, జె.వేణుగోపాలరెడ్డి, ఆర్.వీరాస్వామి నాయుడు, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి, కె.అశోక్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగు పరచడమే లక్ష్యంగా 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు వెల్లడించారు. మండలంలోని కొండపర్వ, విస్సన్నపేట, తాతకుంట్ల, నరసాపురం, మారెమండ, లంబాడి తండా, చంద్రుపట్ల, తెల్లదేవరపల్లి, కలగర, కొర్లమండ, వేమిరెడ్డిపల్లి, పుట్రేల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే సిమెంట్ రహదారుల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. 'పల్లె పండుగ' ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మండలానికి రూ.5 కోట్లు విడుదల చేయగా ప్రాధాన్యతాక్రమంలో గ్రామాలకు కేటాయించామన్నారు. ఎంపీపీ వి.ఎం.వనజాక్షి, ఎంపీడీవో చిన్నరాట్నాలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, పక్కన అధికారులు, నాయకులు తదితరులు

మైలవరం మండలంలో ..

మైలవరం, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 8.30 గంటలకు మైలవరం, 9.30 గంటలకు పొందుగల, 10.30 గంటలకు మొర్సుమిల్లి, 11.15 గంటలకు పుల్లూరు, 12 గంటలకు చంద్రగూడెంలో పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నాయి.

గంపలగూడెం మండలంలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని నెమలి, ఉమ్మడిదేవరపల్లి, కొణిజెర్ల, ఊటుకూరు, తునికిపాడు, దుందిరాలపాడు, పెనుగొలను, చింతలనర్వ, మేడూరు, పెదకొమిర గ్రామాల్లో మంగళవారం 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ డి.బాబూరావు తెలిపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో నిర్మించే సిమెంట్ రహదారులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

వాహనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పోతుల చెరువు వద్ద తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో నిర్మించిన స్వర్గపురికి భౌతిక కాయం తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు స్థానికులు దారా వెంకట గురునాధరావు, కస్తూరి, దారా సీతారామ్మూర్తి, సుశీల దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలు దారా లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, హరిబాబు, రాధాకృష్ణ, జగన్నాథం విరాళాన్ని సోమవారం తోసా సభ్యులకు అందజేశారు. దాతలకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



తోసా సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక కళాశాల వద్ద సోమవారం అధ్యాపకులు ఆందోళన చేశారు. గత వైకాపా పాలనలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జీవో నంబరు 114 ప్రకారం ఒప్పంద అధ్యాపకులను మోసగించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం తమ వినతిపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో భాగంగా 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతామని ఏపీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం స్థానిక నాయకులు కె.నగేష్, ఎం.బాబు, కె.రాంబాబు, తిరుపతిరావు తదితరులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌జీఎన్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అధ్యాపకుల నిరసన

బకాయిలు విడుదల చేయాలి

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి విద్యుత్తు కార్మికులు వెట్టి చాకిరీకే పరిమితమయ్యారని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. ఎన్టీటీపీఎస్ ప్రధాన ద్వారం ఎదుట పోస్ట్ కార్డు ఉద్యమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18, 19 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ విధులకు హాజరవుతామని తెలిపారు. 16 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో షేంషేర్ వలీ, సీహెచ్ చంద్రశేఖర్, కుమార్, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీటీపీఎస్ ప్రధాన ద్వారం వద్ద వర్కర్స్ యూనియన్ సభ్యుల నిరసన



గంపలగూడెం: ఊటుకూరులో బతుకమ్మలను నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు



జి.కొండూరులో అమ్మవారి ఊరేగింపు



కొండపల్లి: బొడ్డురాయి కూడలి వద్ద అన్నదానం



రెడ్డిగూడెంలో బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి వెళ్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో బతుకమ్మల నిమజ్జనం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకొని గ్రామాల్లో మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మలను సోమవారం గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి బతుకమ్మ భక్తిపాటలు ఆలపిస్తూ గ్రామాల ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేసి నిమజ్జనం చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలు సందర్భంగా 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించిన బతుకమ్మలను మహిళలు కోలాట ప్రదర్శనతో భక్తి పాటలతో సమీప వాగుల్లో నిమజ్జనం చేసేందుకు తరలించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల సందర్భంగా కొండపల్లి బొడ్డురాయి కూడలిలో అమ్మవారి ప్రసాదం పంపిణీ సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జి.కొండూరు: స్థానిక బీసీ కాలనీలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీకనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని సోమవారం గ్రామ వీధుల్లో ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీపై వివాదం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ మార్పు వివాదాస్పమైంది. సోమవారం పాఠశాల విద్యా కమిటీ నిర్వాహకులతో పాటు పలువురు నాయకులు పాఠశాలకు వెళ్లి ఏజెన్సీని మార్చాలంటూ ప్రధానోపాధ్యాయురాలిని డిమాండ్ చేయడంతో వివాదం పెరిగింది. వంట ఏజెన్సీకి మద్దతుగా సీపీఎం నాయకులు పాఠశాలకు చేరుకుని నాయకుల తీరును తప్పుపట్టారు. దీర్ఘకాలంగా మైలవరానికి చెందిన మహిళా సంఘం ఆధ్వర్యంలో పథకాన్ని నిర్వహిస్తుండగా, ఇటీవల ఆ ఏజెన్సీని మార్చాలంటూ నూతనంగా ఎంపికైన పాఠశాల విద్యా కమిటీ ద్వారా తీర్మానించారు. అయితే ఏజెన్సీ తప్పుకుంటే తప్ప మార్చే నిబంధనలు లేవని ప్రధానోపాధ్యాయురాలు చెప్పడంతో గత నెలలో చర్చలు వాయిదా పడ్డాయి. సోమవారం ఇదే విషయమై నాయకులు ఉపాధ్యాయుల వద్దకు వెళ్లగా, సమాచారం తెలుసుకుని ప్రస్తుత వంట ఏజెన్సీ నిర్వాహకులకు మద్దతుగా సీపీఎం నాయకులు పాఠశాలకు చేరుకున్నారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు, కొందరు ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారికి విషయాన్ని తెలియజేశారు. దీర్ఘకాలంగా పాఠశాలల్లో ఏజెన్సీ నిర్వహిస్తున్న వారిని తొలగించాలని వివాదం రేపుతున్నారని, ఏజెన్సీ నిర్వహించే మహిళలకు తాము అండగా ఉంటామని సీపీఎం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ పేర్కొన్నారు. వివాదంపై ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మిని, సంప్రదించగా ఏజెన్సీ మార్పు డిమాండు విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లామని, విద్యా కమిటీ తీర్మానంతో మార్పు కుదరదని డీఈవో స్పష్టం చేసినట్లు వెల్లడించారు. అదే విషయాన్ని కమిటీకి తెలుపుతామని వివరించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని నెమలి, కొణిజెర్ల, ఊటుకూరు, ఉమ్మడిదేవరపల్లి, గాదెవారిగూడెం, చింతలనర్వ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ వి.జగదీష్ తెలిపారు.



రామకృష్ణనాయక్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందిస్తున్న నరసింహారావు, వీరాస్వామి

ఎంపీడీవోకు అభినందనలు

ఇటీవల బదిలీపై వచ్చి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బి.వి.రామ కృష్ణ నాయక్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో ఎంఈవో-1 పీవీ నరసింహారావు, ఎంఈవో-2 ఎం.వీరాస్వామి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.
– న్యూస్‌టుడే, జి.కొండూరు

మధిర శాఖ కాల్వకు 841 క్యూసెక్కుల సాగర్ జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పల బంధం నియంత్రిక నుంచి సోమవారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు 841 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలయ్యాయని ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 322 క్యూసెక్కులు చేరాయన్నారు. దిగువున మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు 40, పెదకొమిర 20, మధిర 20, నిదానపురం 40 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఆయకట్టు రైతులు కాల్వలకు సరఫరా చేస్తున్న సాగర్ జలాలను పంటలకు నీటి తడులు అందించేందుకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



23వ కి.మీ నియంత్రిక వద్ద ప్రవహిస్తున్న నీరు




జెండా ఊరేగింపులో ముస్లింలు

ఇబ్రహీంపట్నంలో గ్యార్మీ పండగ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో గ్యార్మీ పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌసే అజం చిహ్నమైన జెండాకు ఊరేగింపు నిర్వహించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముస్తఫా, కరీముల్లా, షేక్ దావూద్, గోరే తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

మైలవరం, న్యూస్‌టుడే: మానవహక్కుల నేత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతిపై మైలవరం బార్ అసోసియేషన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం బార్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పౌరహక్కుల పరిరక్షణకు ఆయన కృషి చేశారని వక్తలు కొనియాడారు. సీనియర్ న్యాయవాదులు పీవీ శేషగిరిరావు, పి.రామకృష్ణ, బార్ నాయకులు ఏడీ ప్రసాద్, వీటీ కిషోర్, రమేష్‌బాబు, సత్యనారాయణరావు, వెంకటరావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, శరత్‌బాబు, తనూజ్ తదితరులు పాల్గొన్నారు.



బార్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

జాతీయ రహదారిపై అంధకారం

జి.కొండూరు, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం నుంచి ఛత్తీస్‌గడ్ వెళ్లే నంబరు-30 జాతీయ రహదారిపై క్రాస్‌రోడ్లు ఉన్న చోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా జి.కొండూరు-పినపాక, జి.కొండూరు-ఆత్కూరు, చెవుటూరు క్రాస్ రోడ్ల సమీపంలో వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో జాతీయ రహదారి ఏర్పడిన తర్వాత తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ క్రాస్‌రోడ్ల వద్ద పోలీసులు వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు వీధి దీపాలు లేకపోవడంతో కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



జి.కొండూరు ఆత్కూరు వద్ద ఇలా..

★ ఆత్కూరు క్రాస్‌రోడ్డు వద్ద గతంలో ఓ ద్విచక్ర వాహనదారుడు పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఢీకొట్టి గాయపడ్డాడు.

★ ఇటీవల చెవుటూరు బైపాస్‌లో గ్రామంలోని నుంచి వచ్చే రోడ్డు కలిసే చోట దీపాలు లేకపోవడంతో అర్ధరాత్రి దాటిన తరువాత ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

★ చిన్న చిన్న ప్రమాదాలు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు కావడం కూడా తక్కువే. ఇప్పటికైనా జాతీయరహదారి, ర.భ రహదారి అధికారులు సమన్వయంతో ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం



వీధిదీపాలు లేని జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు

★ ఈ విషయమై జాతీయ రహదారి సంబంధిత అధికారి లతను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వీధిదీపాలు ఏర్పాటు తమ పరిధి కాదని, ర.భ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. ర.భ అధికారి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు.

పట్టభద్రులు ఆలోచనతో ఓటు వేయండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని పట్టభద్రులు గమనించి ఓటు వేయాలని కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన పట్టభద్రుల పరిచయ వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ పాలనను మూడు నెలలుగా అందరూ చూశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలతో బహుముఖ లాభాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : మహిళా సాధికారతకు పెద్దపీట వేసే పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా)కు సారథ్యం వహించే టీఎల్‌ఎఫ్(పట్టణ సమాఖ్య) ప్రతినిధులకు నాయకత్వ లక్షణాలు ఉండాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ కర్లపాటి శ్రీనివాసరావు సూచించారు.

సంచార జాతులను ఆదుకోవాలి

జగ్గయ్యపేట గ్రామీణం: సంచార జాతుల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులే కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని చిల్లకల్లులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రైల్వే కార్మికులకు రక్షణ కల్పించండి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వేస్టేషన్ పరిసరాల్లో రైల్వే కార్మికులకు రక్షణ కల్పించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన లోకో పైలెట్ ఎబినేజర్ ఘటనకు నిరసనగా సోమవారం రైల్వేకార్మిక సంఘాల ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే లోకో పైలెట్‌ను అత్యంత కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విజయవాడ తూర్పు

3న ఈత పోటీలు

విజయవాడ క్రీడలు: నగరంలోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో వచ్చే నెల 3వ తేదీన సౌత్ జోన్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఈత పోటీలు నిర్వహిస్తామని ఆయా జిల్లా సంఘాల కార్యదర్శులు ఐ. రమేష్, వి.వినోద్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆసక్తిగల స్విమ్మర్లు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు జాతీయ స్విమ్మింగ్ సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)యూఐడీతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ గుర్తింపు కార్డు లేని పోటీలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 79895 34719 (ఎన్టీఆర్ జిల్లా), 91607 66070 (కృష్ణా జిల్లా) నంబర్లలో సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

❖ మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ తాగునీటి పైపు లీకవుతోందని స్థానిక నివాసి రాజా మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.

❖ రెండో డివిజన్ మాచవరం, గుణదల ప్రాంతాల్లోని కొండ ప్రాంతాల్లో 2-26/124 విద్యుత్తు స్తంభానికి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి గాబ్రియేల్ మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? మహానాడు రోడ్డు జంక్షన్ వద్ద గోతులు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. **- రవీంద్ర**

✔ గోతులు పూడ్చిస్తున్నాం. **- రమేష్, ట్రాఫిక్ సీఐ**

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

అన్నదానం

పటమట: దసరా వేడుకల ముగింపు సందర్భంగా దర్శిపేట రాజరాజేశ్వరి ఆలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ హాజరై అన్నదానం ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆవుల నాసరయ్య, పోతంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్న బొప్పన భవకుమార్ తదితరులు

హడలెత్తిస్తున్న చరవాణి దొంగలు

పటమట రైతు బజారులో ఆదివారం లక్ష్యంగా చోరీలు

పటమట, న్యూస్‌టుడే

పటమట రైతు బజారులో ఆదివారం రోజు కూరగాయలు కొనాలంటేనే వినియోగదారులు వణికిపోతున్నారు. దీనికి కారణం.. రైతు బజారులో ఆదివారం సుమారు 5 నుంచి 6 చరవాణులు చోరీలకు గురికావడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం సరాసరి రెండు నుంచి మూడు చరవాణులు చోరీలకు గురవుతున్నాయి. సులువుగా ఫోన్లు చోరీ చేయడం వాటిని అమ్మడం లాభసాటిగా మారడంతో పాత నేరస్థుల, జేబుదొంగలు ఇదే మార్గం ఎంచుకుంటున్నారు. దీనికోసం ఏకంగా ముఠాలు పని చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సెకన్ల కాలంలో ఫోన్ దొంగిలిస్తున్నారు. గుర్తించేలోగా అక్కడ నుంచి పరారవుతారు. అపహరణపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్లకు వెళ్లినా చాట్‌బాట్‌లో ఫిర్యాదు చేయిస్తున్నారని, దానికి నామమాత్రపు స్పందన ఉంటోందని బాధితులు ఆందోళన చెందుతున్నారు.



ఇటీవల పటమట రైతు బజారులో చరవాణి చోరీ చేసిన నిందితుడు



పటమట రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆదమరిస్తే అంతే..

ఆదివారం ఉదయం 7 గంటలకే నేరగాళ్లు పటమట రైతు బజారుకు చేరుకుంటున్నారు. రైతు బజారులో తిరుగుతూ పరిశీలిస్తారు. కంగారుగానో, అజాగ్రత్తగా ఉన్నట్లు కనిపిస్తే వారి చరవాణులు చోరీ చేస్తారు. ఎక్కువగా వృద్ధులు, మహిళలు, ఆదమరుపుగా ఉండేవారిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పోయిన చరవాణులను సీఈఐఆర్ ట్రాకింగ్‌తో పోలీసులు పట్టుకుంటారేమోనని కొంతమంది నేరగాళ్లు సిమ్‌లు వేయకుండా విడిభాగాలను ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో అమ్మేస్తున్నారు.

గస్తీ ఏర్పాటు చేస్తే మేలు..

ఆదివారం సెలవు కావడంతో పటమట రైతు బజారులో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీన్ని అదునుగా తీసుకున్న నేరగాళ్లు రైతు బజారులో కేవలం ఆదివారం లక్ష్యంగా చరవాణులు చోరీలు చేస్తున్నారు. ఆ రోజు పోలీసు సిబ్బందిని కేటాయిస్తే నేరగాళ్లు లోపలకు వచ్చేందుకు భయపడతారు. దీంతో పాటు పాత నేరస్థులు, జేబుదొంగలు ఫొటోలను రైతు బజారు వద్ద ప్రదర్శిస్తే వినియోగదారులు అప్రమత్తమవుతారని పలువురు పేర్కొంటున్నారు.

6 పెనమలూరుకు చెందిన కిలారు రాజశేఖర్ ఈ నెల 6న కూరగాయలు కొనేందుకు పటమట రైతు బజారుకు వెళ్లారు. వెళ్లిన 5 నిమిషాలకు చూసుకుంటే చొక్కా జేబులో పెట్టిన చరవాణి (ఐఫోన్-15) కనిపించలేదు. దీంతో పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

6 అయ్యప్పనగర్‌కు చెందిన పరసా బాలాజీ గత నెల ఆదివారం కూరగాయలు కొనేందుకు పటమట రైతు బజారుకు వచ్చారు. కూరగాయలు తీసుకున్నాక చూస్తే తన జేబులో ఫోన్ మాయమై పోయింది. దీనిపై పటమట పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా చాట్ బాట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయమని తెలిపారు.

6 ఈ ఏడాది జూలైలో పటమటకు చెందిన బహదూర్ కూరగాయలు కొనేందుకు పటమట రైతు బజారుకు వెళ్లారు. ఒక వ్యక్తి తన చరవాణి చోరీ చేసి పారిపోతుండగా గట్టిగా కేకలు వేయడంతో వినియోగదారులు అతన్ని పట్టుకున్నారు. దొంగించిన వ్యక్తిని పటమట పోలీసులకు అప్పగించి, ఫిర్యాదు చేశారు.

పొట్టేల్ చిత్ర బృందం సందడి

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నగరంలో పొట్టేల్ చిత్ర బృందం సోమవారం సందడి చేసింది. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ అనన్య నాగళ్ల మాట్లాడుతూ ఇప్పటి వరకు తాను చేసిన చిత్రాల కంటే భిన్నంగా పొట్టేల్ సినిమా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. చిత్రంలో సీనియర్ నటుడు అజయ్ పాత్ర ప్రేక్షకులను కట్టిపడేసే విధంగా ఉంటుందని తెలియజేశారు. ఈ నెల 25న విడుదలయ్యే ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. హీరో యువన్ కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. సమావేశంలో నటుడు నోయల్, సహ నిర్మాత నిశాంక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హీరోయిన్ అనన్య, హీరో యువన్ కృష్ణ, సహ నిర్మాత నిశాంక్‌రెడ్డి, నోయల్

వస్తువుల నాణ్యతపై అప్రమత్తత అవసరం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత ప్రమాణాల వస్తువులను అందుబాటులోకి తీసుకురావడమే భారతీయ ప్రమాణాల బ్యూరో ప్రధాన ఉద్దేశమని భారతీయ ప్రమాణాల సంస్థ సీనియర్ డైరెక్టర్ అండ్ సైంటిస్ట్ ఎంపజే వినోద్ అన్నారు. సోమవారం ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ ఆధ్వర్యంలో నగరంలోని హయత్ ప్లేస్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వస్తువు కొనుగోలులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అన్న విషయాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాణ్యతలో లోపాలు కనిపిస్తే ఫిర్యాదు చేయాలని, తగినంత నష్టపరిహారం పొందేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. బీఐఎస్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డి.వివేక్ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ వినియోగదారుడు తాము కొనుగోలు చేసే వస్తువు నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు బీఐఎస్ కేర్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈనెల 20వ తేదీన ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద 'క్వాలిటీ వాక్' నినాదంతో నడక ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించిన తయారీదారులను సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శర్మ సిలిండరీస్ అండ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ జీవీఎస్ శర్మ, ఏపీ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు డైరెక్టర్ వై.ప్రసాద్, పీవీపీ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ హెడ్ జగదీష్ మంగళ, సాయి కౌశిక్, డి.అఖిల్, ఎస్వీఎస్ భవన్ నారాయణ, ఎస్.పద్మలత, కృష్ణవీర్, పలువురు పారిశ్రామిక వేత్తలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



క్వాలిటీ వాక్ గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వినోద్ తదితరులు

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి

భవానీపురం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య నిర్వహణలో ఏ విధమైన లోపం లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరంలోని కృష్ణవేణి ఘాట్, అన్నక్యాంటీన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఘాట్ వద్ద భక్తులు విడిచి పెట్టే దుస్తులను ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. పటమట హైస్కూలులో ఉన్న అన్నక్యాంటీన్‌ను పరిశీలించి ప్లేట్లను శుభ్రం చేయాలని, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. నీటి సౌకర్యం ఉండేలా చూడాలని కోరారు.

❖ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కమిషనర్ అన్నారు. నగరంలోని 8వ డివిజన్ సిద్ధార్థనగర్ ప్రాంతంలో ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కాలువల్లో పూడిక తొలగించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.



స్నానఘాట్‌ల వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

బెంజిసర్కిల్ (విజయవాడసిటీ), న్యూస్‌టుడే : ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల సంక్షేమ బోర్డును వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చి సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకోవాలని సీఐటీయూ విజయవాడ తూర్పుసిటీ అధ్యక్షుడు వీబీ రాజు అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ విజయవాడ తూర్పు సిటీ కమిటీ ఆధ్వర్యంలో బెంజిసర్కిల్ అడ్డా వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులందరికీ జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు నాగమల్లేశ్వరరావు, దుర్గారావు, రామకృష్ణ, అప్పారావు, కొండలరావు, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

పొదలు తొలగి..
భయం వీడి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



వసతి గృహాల వద్ద పొదలు తొలగిస్తున్న పొక్లెయిన్



పనులు నిర్వహించిన తర్వాత సిద్ధార్థ వైద్య కళాశాల అండర్ గ్రాడ్యుయేట్ వసతి గృహం వద్ద

దశాబ్దాల సమస్య పరిష్కారం
వైద్య విద్యార్థుల్లో ఆనందం

వైద్య విద్యార్థుల వసతి గృహాల పక్కన పరిసరాలు ఎట్టకేలకు బాగుపడుతున్నాయి. గతంలో ఆ ప్రాంతాల్లో అసౌకర్యాలు దర్శనమిచ్చేవి. రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయపడేవారు. కొన్ని దశాబ్దాల నుంచి నెలకొన్న ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజుల నుంచి బాగుచేత పనులు నిర్వహిస్తున్నారు.

☛ సిద్ధార్థ వైద్య కళాశాల అండర్ గ్రాడ్యుయేట్ వసతి గృహాల వద్ద పిచ్చిమొక్కలు, పొదలతో దట్టంగా చెట్లు ఉండేవి. రాత్రి సమయంలో పరిసరాలు నిర్మానుష్యంగా ఉండేవి. వాటి కింద మురుగు ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. రాత్రి సమయంలో దోమల బెడద అధికంగా ఉండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పొదల్లో నుంచి పాములు, తేళ్లు, ఇతర విషపు కీటకాలు వసతి గృహాల్లోకి వచ్చేవి. విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందేవారు.


☛ ఈ సమస్యను విద్యార్థులు పలు పర్యాయాలు హాస్పటల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. కొన్నేళ్ల నుంచి జాప్యం చేసుకుంటూ రావడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీనిపై హాస్పటల్ సూపరింటెండెంట్, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.వెంకటేష్ స్పందించారు. కొన్ని రోజుల నుంచి సిబ్బందితో బాగుచేత పనులు నిర్వహిస్తున్నారు. చెట్లు, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను పొక్లెయిన్లతో తొలగిస్తున్నారు. మురుగు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేశారు. ప్రాంగణం పరిశుభ్రంగా మారడంతో వైద్య విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాంగణం బాగుపడింది



కొన్నేళ్ల నుంచి మేముంటున్న వసతి గృహం పక్కన చెట్లు, పొదలతో దట్టంగా ఉండేవి. రాత్రి సమయంలో దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. పాములు, తేళ్లు తిరగడం వల్ల భయం వేసేది. వీటన్నింటినీ తొలగించడం వల్ల భయం తొలగిపోయింది. ప్రాంగణం బాగుపడింది. **- ప్రవీణ్ మోర్ల, సిద్ధార్థ వైద్యకళాశాల వసతి గృహం అధ్యక్షుడు**

సమస్యకు మోక్షం



పరిసరాలు బాగు చేసి కొన్నేళ్ల నుంచి నెలకొన్న సమస్యకు మోక్షం కల్పించారు. ప్రిన్సిపల్ చొరవ చూపడం వల్ల ఇబ్బందులు తొలగిపోయాయి. చెట్లు, పొదలు తొలగించడంతో పాటు మురుగు పోయేందుకు చర్యలు తీసుకున్నారు. నిల్వ ఉన్న నీటిని ఇంజిన్లతో తొలగిస్తున్నారు. **- చరణ్, వైద్యవిద్యార్థి**

క్రీడాకారిణులకు అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలకు చెందిన పలువురు క్రీడాకారిణిలు స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్, తైక్వాండో అండర్-19 పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి పతకాలు కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ తెలిపారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో కళాశాలకు చెందిన ఎస్.లీలామృత, డి.జయంతి, పి.సిరి జిల్లా జట్టు రన్నరప్ ట్రోఫీ సాధించడానికి దోహదపడ్డారన్నారు. ఈ నెల 4వ తేదీన జరిగిన తైక్వాండో పోటీల్లో కళాశాలకు చెందిన జె.భవిష్య యోచిత పసిడి, డి.మేఘన కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారిణులను పలువురు అధ్యాపకులు అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారిణులతో పద్మజ

టీటీలో రాణింపు..

విజయవాడ క్రీడలు: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) టేబుల్ టెన్నిస్ కోచ్ ఎస్‌కే ముంతాజ్ బేగం పర్యవేక్షణలో సాధన చేస్తున్న ఇద్దరు చిన్నారులు రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టీటీ టోర్నీలో పతకాలు కైవసం చేసుకున్నారని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు ఒంగోలులో జరిగిన రాష్ట్ర ర్యాంకింగ్ టీటీ టోర్నీలో అండర్-11 బాలికల కేటగిరీలో పి.శ్రీకర లాస్య అండర్-13 బాలుర కేటగిరీలో జె.సుహాస్‌బాబు కాంస్య పతకాలు గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఐజీఎంసీ స్టేడియంలోని డీఎస్‌కే కార్యాలయంలో చిన్నారులను, కోచ్‌ను పలువురు శిక్షకులు అభినందించారు.



శ్రీకర లాస్యను అభినందిస్తున్న అజీజ్

గల్లంతైన యువకుడి మృతి

కృష్ణలంక, న్యూస్‌టుడే : కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధి స్వర్గపురి సమీపంలోని కృష్ణానదిలో ఆదివారం సాయంత్రం గల్లంతైన యువకుడి మృతదేహం లభించింది. కోడూరు మండలం వి.కొత్తపాలెంకు చెందిన రేపల్లె రాజు(20), పోతినేని కేశవ నారాయణ(21), వి.విష్ణువర్ధన్(21)లు లబ్బీపేట పైడయ్య వీధిలోని బాలుర వసతి గృహంలో ఉంటూ సీఏ చదువుతున్నారు. ముగ్గురూ ఆదివారం సాయంత్రం 5 గంటలకు కృష్ణలంక స్వర్గపురి సమీపంలోని కృష్ణానది పాయ వద్దకు వెళ్లారు. వీరిలో రాజు, విష్ణువర్ధన్‌లు నీటిలో దిగగా కేశవ నారాయణ మాత్రం ఒడ్డునే ఉన్నారు. కొద్దిసేపటికి విష్ణువర్ధన్ నీటిలో మునిగిపోతూ కేకలు వేయడంతో సమీపంలోని జాలరులు అప్రమత్తమై అతడిని వెలికితీశారు. నీటిలో దిగిన రాజు కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. అయినప్పటికీ అతడి ఆచూకీ లభించకపోవడంతో గాలింపు కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేశారు. కృష్ణలంక పోలీసులు సోమవారం ఉదయం ఘటనా స్థలం వద్దకు వెళ్లి గాలింపు చేపట్టి రాజు మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

రతన్ టాటా మృతి ప్రపంచానికే తీరని లోటు

పటమట, న్యూస్‌టుడే : రతన్ టాటా మృతి కేవలం దేశానికే కాదని ప్రపంచానికి తీరని లోటని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, జె.ఆర్.డి టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ, ఏపీ ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో గంగరాజు మాట్లాడుతూ రతన్ టాటా విలువలకు, నీతి నిజాయతీకి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. తన ఆదాయంలో సగానికి పైగా సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంతో ప్రజల మనసులోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌ఎంఈ అధ్యక్షుడు బాయిన వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బాయిన వెంకట్రావు తదితరులు

అత్తమామలపై అల్లుడి దాడి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆస్తి తగాదాల విషయంలో పిల్లనిచ్చిన అత్తమామలపై అల్లుడు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన తిరుపతి జిల్లా గూడూరు ఇందిరానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యంతో కొన్నేళ్ల కిందట వివాహం చేశారు. ఈ క్రమంలో అల్లుడు సుబ్రహ్మణ్యం, అత్తమామలకు ఆస్తి విషయంలో తరచూ గొడవ జరిగేది. ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం, అతని బంధువులు నలుగురు ఇందిరానగర్‌కి వచ్చి కృష్ణారావు, ధనలక్ష్మితో ఘర్షణ పడి ఇనుప రాడ్డుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా

విజయవాడ క్రీడలు: హిమాచల్‌ప్రదేశ్‌లోని నాగ్రోత్ బాగ్వాన్‌లో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర లిఫ్టర్ల బృందం పలు ట్రోఫీలు కైవసం చేసుకున్నాయని సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.దీన్నాబాబు తెలిపారు. యూత్ బాలబాలికల విభాగాలతో పాటు జూనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో టీమ్ ఛాంపియన్‌షిప్పులను సొంతం చేసుకున్నాయని పేర్కొన్నారు. లిఫ్టర్లను పలువురు అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న రాష్ట్ర లిఫ్టర్ల బృందం

యోగాలో పసిడి పతకం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన యోగా క్రీడాకారిణి జి.జ్యోత్స్నాదేవి ప్రతిభ ప్రదర్శించి ట్రోఫీ, పతకాలు కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపల్ ఎం.రమేష్ తెలిపారు. ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్‌లో జ్యోత్స్నాదేవి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆర్టిస్టిక్ యోగాలో పసిడి, ట్రెడిషనల్ యోగాలో కాంస్య పతకాలు సొంతం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, వ్యాయామ విద్య విభాగాధిపతి టీవీబీ కృష్ణారెడ్డి విద్యార్థినిని అభినందించారు.



జ్యోత్స్నాదేవిని అభినందిస్తున్న ఎం.రమేష్ తదితరులు

బందోబస్తు అధికారులు.. సిబ్బందికి సత్కారం



ఏడీసీపీ రాజారావుకు శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం ఇచ్చి సత్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రులు విజయవంతానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అభినందనలు తెలిపారు. బందోబస్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూలా నక్షత్రం, విజయదశమి రోజున భక్తులు విపరీతంగా తరలివచ్చారని చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు, సిబ్బందికి కనకదుర్గమ్మ వారి శేషవస్త్రం, ఫొటో, లడ్డూ ప్రసాదం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ
•నందిగామ •జగ్గయ్యపేట

ప్రగతికి పట్టం.. పల్లెకు ఊతం..

నందిగామ నియోజకవర్గంలో రూ.22.3 కోట్ల అభివృద్ధి పనులు

కంచికచర్ల, న్యూస్‌టుడే



కంచికచర్ల: రూపు మారనున్న చెవిటికల్లు రహదారి

వైకాపా పాలనతో నిర్వీర్యమైన పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. తెదేపా సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామ పంచాయతీలకు విడుదల చేయగా.. తాజాగా అంతర్గత రహదారులను యుద్ధ ప్రాతిపదికన నిర్మించేలా ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి మండలానికి రూ.5 కోట్ల నిధులు కేటాయించింది. ఈ నెల 14 నుంచి 'పల్లె పండగ' పేరుతో గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించేలా కార్యక్రమాలు రూపొందించిన ప్రభుత్వం.. పనులు వచ్చే సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టింది.

నందిగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశాలతో నాలుగు మండలాల్లో నాయకులు గుర్తించిన మొత్తం 122 పనులకు రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో మండలానికి రూ.5 కోట్లు కేటాయించారు. వీటితో పాటు అదనంగా ఒక్కో గోకులానికి రూ.2.30 లక్షల నిధుల అంచనా వ్యయంతో మండలానికి 25 గోకులాలు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 100 గోకులాలకు 2.30 కోట్లు నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. వైకాపా విధ్వంస పాలనలో అభివృద్ధి ఊసే ఎరుగని పల్లెలకు కూటమి ప్రభుత్వంలో మంచి రోజులు వచ్చాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం పేరు	మొత్తం పనులు
నందిగామ	30
చందర్లపాడు	29
కంచికచర్ల	35
వీరులపాడు	28

రూ.4.55 కోట్లతో అభివృద్ధి పనులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో రూ.4.55 కోట్లతో 27 పనులు చేపట్టనున్నారు. సోమవారం బొబ్బెళ్లపాడు, గుత్తావారిపాలెం తదితర గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి గ్రామస్థులతో ఉపాధి హామీ పథకం సిబ్బంది భూమిపూజ చేయించారు. చందర్లపాడులో 4 అభివృద్ధి పనులు రూ.99 లక్షలు, ముప్పాళ్ల 2 పనులకు రూ.43 లక్షలు, చింతలపాడు రెండుకు రూ.36లక్షలు, పొక్కునూరు ఒక పనికి రూ.15 లక్షలతో చేపట్టనున్నారు. కొడవటికల్లు, పున్నవల్లి, వెలదికొత్తపాలెం, పోపూరు, విభరింతలపాడు, ఏటూరు, తోటరావులపాడు, తుర్లపాడు, మునగాలపల్లి, బొబ్బెళ్లపాడు, కోనాయపాలెం, ఉస్తేపల్లి, గుడిమెట్ల, గుత్తావారిపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లోనూ పనులు నిర్వహించనున్నారు.

అన్నదాతల కడగండ్లు



నెత్తిన ఎరువు బస్తాతో ముప్పాళ్ల డొంక గండిని దాటుతున్న రైతులు

మండలంలోని పాతకంచల గ్రామంలో చెరువుకు పడిన గండ్లను అసంపూర్తిగా పూడ్చడంతో పంట పొలాలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆగస్టులో వచ్చిన వరదకు చెరువుకు భారీ గండ్లు పడ్డాయి. ఇటీవల రెండు గండ్ల మాత్రమే పూడ్చారు. మిగిలిన గండ్లను వదిలేశారని గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. వరి పొలాలకు ఎరువు బస్తాలు మోసుకువెళ్లే సమయంలో గండ్లు దాటేందుకు ఇబ్బంది పడుతున్నామని, అన్ని గండ్లను పూడ్చివేయాలని కోరుతున్నారు. పాత కంచల-ముప్పాళ్ల డొంక రోడ్డుకు వరదలతో గండ్లు పడ్డాయి. డొంక రోడ్డు మీదుగా పంట పొలాలకు రాకపోకలకు వీలుపడక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అధికారులు ఈ సమస్య పరిష్కరించాలని కర్షకులు కోరుతున్నారు.

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

జనసేనలో చేరిక



పెనుగంచిప్రోలు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి ఆలయ ఛైర్మన్ కొమరగిరి భద్రయ్యలు సోమవారం మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. ఉదయభాను వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చారుగుండ్ల కొండ, గుంటక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

ఏం కొనేట్టులేదు.. తినేట్టులేదు

భారీగా పెరిగిన ధరలతో ప్రజల బెంబేలు

నందిగామ, న్యూస్‌టుడే



కూరగాయల కొనుగోలుకు వచ్చిన ప్రజలు

కూరగాయల ధరలు భారీగా పెరగడంతో కొనడానికి వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఏ ధరలు చూసినా సామాన్యునికి అందుబాటులో ఉండడం లేదు. వీటి బడ్జెట్ అనూహ్యంగా తలకిందులు కావడంతో కిలో, అర కిలో కొనుగోలు చేయాల్సిన వారు పావుతో సరిపెట్టుకోవల్సి వస్తోంది. గత నెలలో కురిసిన అతిభారీ వర్షాలు, వరదలు వల్ల తోటలు దెబ్బతిన్నాయి. చివరికి ఆకు కూరల తోటలు స్వరూపం కోల్పోయాయి. దీంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ప్రభావం కూడా ధరలపై భారీగా పడ్డాయి. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల టమాటా, ఉల్లి ధరలు కొంతవరకు అందుబాటులో ఉన్నాయి.

రైతుబజారుల్లో సైతం ఎక్కువే..

నందిగామ నియోజకవర్గంలో నందిగామ, కంచికచర్ల రైతు బజార్లు ఉన్నాయి. వీటిల్లో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్దేశించిన ధరలకు కూరగాయలు విక్రయిస్తారు. నందిగామ, కంచికచర్లలో బయట మార్కెట్ కంటే కేజీకి రూ.5 నుంచి రూ.10 వరకు తక్కువగా ధర ఉంటుంది. దీనివల్ల రైతుబజార్లుకు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. నందిగామ రైతుబజారుకు నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు, వీరులపాడు మండలాలకు చెందిన వారు భారీగా వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తారు. దీనికి అనుగుణంగా సరఫరా లేకపోవటం వల్ల రోజంతా కూరగాయలు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది.

నందిగామ రైతుబజారులో సోమవారం ధరలు

టమాట రూ.50, వంకాయ రూ.38, బెండకాయ రూ.28, కాకరకాయ రూ. 38, బీరకాయ రూ.44, క్యారెట్ రూ.47, దొండకాయ రూ.28 బంగాళదుంపలు రూ. 48, గోరుచిక్కుళ్లు రూ.30, దోసకాయ రూ.32, బీన్స్ రూ.130, కాప్సికం రూ. 72, బీట్‌రూట్ రూ.30, పచ్చిమిర్చి రూ.42 ఉంది. సొరకాయ ఒక్కటి రూ.25, పొట్లకాయ రూ.40 అమ్ముతున్నారు. అంత ధర పెట్టి కొనుగోలు చేయలేక పోతున్నారు. దీనివల్ల పేదలు పచ్చళ్లతో కాలం వెళ్లదీస్తున్నార

వర్షాలకు దెబ్బతిన్న పంటలు

గత నెలలో వచ్చిన అధిక వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా తోటలు దెబ్బతిన్నాయి. దీని ప్రభావం వల్ల స్థానికంగా పండే కూరగాయల దిగుబడి పడిపోయింది. నందిగామ నియోజకవర్గంలో మాగల్లు, తుర్లపాడు, తోటరావులపాడు, కంచలతో పాటు మూలపాడు, కొటికలపూడి, జుజ్జూరు, గొట్టెముక్కల, చెవిటికల్లు, పెండ్యాల, మాగల్లు తదితర గ్రామాల్లో సాగు చేసిన బెండకాయ, బీరకాయ, సొరకాయ, దోసకాయ, గోరుచిక్కుళ్లు, టమాటా, వంగ తోటలకు నష్టం వాటిల్లింది. వీటితో పాటు ఆకుకూరల తోటలు దెబ్బతినడం వల్ల రైతులు నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో రైతులు మళ్లీ విత్తనాలు వేసి సాగు చేశారు. వీటిల్లో దిగుబడులు రావడానికి మరో నెలకు పైగా సమయం పడుతుంది. కొత్త పంట అందుబాటులోకి వస్తే ధరలు తగ్గుతాయి.

గ్రామసీమలకు నూతన శోభ



కంచికచర్ల: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన ఇన్‌ఛార్జి రమాదేవి



గౌరవరం: శంకుస్థాపనలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



బలుసుపాడులో పూజ చేస్తున్న వెలమాటి చంద్రమౌళి

కంచికచర్ల, న్యూస్‌టుడే: వైకాపా పాలనతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, రాష్ట్రం పూర్వ వైభవం పొందేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. 'పల్లె పండుగ'లో భాగంగా కంచికచర్లలో సోమవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తంబళ్లపల్లి రమాదేవితో కలిసి ఆమె పాల్గొన్నారు. నందిగామ నియోజకవర్గంలో మండలానికి రూ.కోటితో సీసీ రహదారులు, డ్రెయిన్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. సంక్రాంతి నాటికి నిర్మాణం చేపట్టిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం తపిస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండేలా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన ఇన్‌ఛార్జి రమాదేవిలకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. షేర్‌మహమ్మద్‌పేట, గౌరవరంలో జరిగిన 'పల్లె పండగ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ షేర్‌మహమ్మద్‌పేట రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గౌరవరం గ్రామంలో రూ.50 లక్షలతో వివిధ పనులు చేపట్టామన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.5 కోట్లతో గ్రామ పంచాయతీల్లో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

☛ మండలంలోని బలుసుపాడులో వెలమాటి గిరిజా మనోహర్ ప్రసాద్ స్మారక జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి గ్రామ పెద్దలు వెలమాటి చంద్రమౌళి సోమవారం శంకుస్థాపన చేశారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాయకులు బద్దుల వెంకట రామయ్య, వల్లెపు శ్రీను, లక్కా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బంపర్ డ్రా విజేత ప్రకటన

జగయ్యపేట, న్యూస్‌టుడే : కాసం ఫ్యాషన్స్ జగ్గయ్యపేట దసరా మహోత్సవంలో భాగంగా ప్రకటించిన 'ప్రతి ఊరికి ఒక బైక్' బంపర్ డ్రా విజేతలను సోమవారం ప్రకటించారు. సైదేశ్వర్‌రావు కూపన్ నంబర్ సీఏ73024641/10/24 విజేతగా నిలిచారు.

పల్లె పండగ, ప్రజా దర్బార్ నేడు

వీరులపాడు, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని జుజ్జూరు, అల్లూరు గ్రామాల్లో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం పాల్గొంటారని తెదేపా మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అల్లూరులో 'ప్రజా దర్బార్'లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆర్డీవోకు సన్మానం

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక ఆర్డీవో కె.బాలకృష్ణను ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు పి. మీరాహుస్సేన్, ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుద్దుకూరి వెంకటకృష్ణలు సత్కరించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం బాలకృష్ణను సత్కరించారు. నందిగామలో డివిజనల్ పీఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆర్డీవోను కోరారు. పఠాన్ సైదాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఇన్‌ఛార్జి ఎంపీపీ ఆకుల హనుమంతురావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

జనసేన కార్యకర్త కుమారుడికి సాయం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : పట్టణంలోని మిట్టగూడెం ప్రాంతానికి చెందిన జనసేన కార్యకర్త గుంజ దుర్గారావు కుమారుడు రవి గణేష్ పాఠశాల ఫీజు నిమిత్తం అవసరమైన రూ.25 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వారి కుటుంబానికి సోమవారం అందజేశారు. స్థానిక శ్రీకృష్ణ దేవరాయ కాపు సేవా సమితి ప్రధాన కార్యదర్శి ముత్యాల శేషు వితరణతో ఏర్పాటైన ఈ ఆర్థిక సాయాన్ని అందించిన ఆయన దాతను అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : మునేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై అర్జున్ తెలిపారు. మండలంలోని వెంకటాపురం, అనిగండ్లపాడు రేవుల నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు.

పాతవి తీయరు... కొత్తవి వేయరు!

పచ్చదనంపై పురపాలక నిర్లక్ష్యం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే



కోదాడ రోడ్డులో ఇంకా తొలగించని కోనో కార్పస్ చెట్లు



విజయవాడ రహదారిలో నామమాత్రంగా వేసిన మొక్కలు

జగ్గయ్యపేట సెంటర్ డివైడర్లలో గత పాలకవర్గ హయాంలో వేయించిన కోనో కార్పస్ చెట్లు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమని నిర్ధారించి తొలగించాలని తీసుకున్న నిర్ణయం మూడు వారాలైనా ఆచరణాత్మకం కాలేదు. పట్టణంలోని ప్రధాన వీధులైన కోదాడ, విజయవాడ రహదారుల్లో సుమారు కి.మీ మేర ఈ చెట్లు వేశారు. అప్పట్లో ఒక్కో దానికి రూ.వెయ్యి చొప్పున వెచ్చించడమే కాక వాటి నిర్వహణకు కూడా రూ.లక్షల్లోనే ఖర్చయ్యింది. పశువులు తినకపోవడం, ప్రతికూల వాతావరణంలో సైతం పెరుగుతాయన్న ఉద్దేశంతో వీటిని నాటారు. కానీ శాస్త్రవేత్తలు వీటిని జనావాసాల్లో హానికరమైన చెట్లుగా నిర్ధారించడంతో అనేక చోట్ల ఈ చెట్లను ఇప్పటికే తొలగించారు.

తాత్సారం జరుగుతూనే ఉంది

జగ్గయ్యపేట పురపాలక సంఘంలోనూ గత నెల చివరి వారంలోనే నిర్ణయం తీసుకుని ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధికారులను ఆదేశించడంతో పాటు ప్రజలకు ప్రకటన కూడా చేశారు. కేవలం బస్టాండ్ ముందు ఉన్న భాగం వరకూ చెట్లను తొలగించిన పురపాలక సంఘం అధికారులు అక్కడ ఒక నాలుగు ప్రత్యామ్నాయ మొక్కలను నాటి వదిలేశారు. మిగిలిన మొక్కల తొలగింపు, తీసిన ప్రదేశంలో కొత్తవి నాటడం రెండిటి విషయంలో సుమారు మూడు వారాలుగా తాత్సారం జరుగుతూనే ఉంది. వర్షాకాలం వెళ్లేలోగా పూర్తి చేయాల్సిన మొక్కల పనిలో కూడా ఆరంభ సూరత్వం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కోగంటి మరణం పార్టీకి తీరని లోటు

చెవిటికల్లు(కంచికచర్ల), న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి కోగంటి విష్ణువర్ధన్ నిరంతరం తపించేవారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ మండలం ఐతవరం వద్ద ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో మరణించిన చెవిటికల్లు మాజీ సర్పంచి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ భౌతికకాయానికి సోమవారం ఆమె నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన కోగంటి మరణం పార్టీకి తీరని లోట న్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సంచార జాతులను ఆదుకోవాలి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : సంచార జాతుల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులే ఈ ప్రభుత్వం కూడా చేస్తుందని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని చిల్లకల్లులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 37 సంచార కుల వృత్తులు అంతరించిపోయి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని తెలిపారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ ఛైర్మన్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ని జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయన సత్కరించారు. పట్టణ పరిధిలో ఉన్న వైద్యారోగ్య పరిస్థితులను మంత్రికి వివరించారు.



మంత్రిని సన్మానిస్తున్న ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

అధ్వానం.. అపరిశుభ్రం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే



కోదాడ రోడ్డుపై ప్రవహిస్తున్న కాల్వ నీరు

పట్టణంలో నిత్యం వేల వాహనాలు తిరిగే కోదాడ రోడ్డులో అండర్ పాసింగ్ సమీపంలో ప్రధాన రహదారిపై నిలిచి ఉండే నీటి మడుగు ప్రయాణికులకు సమస్యగా మారింది. రోడ్డు పక్కనే ఉన్న అలుగు నీటి కాల్వలు పూడుకుపోవడంతో ఏర్పడిన ఈ సమస్యకు పరిష్కారమే లేకుండా పోయింది. ఈ మడుగు సమీపంలోనే ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలోని వందలాది మంది విద్యార్థులు దీన్ని దాటుకుని వెళ్లిరావాల్సి వస్తుంది. అదే ప్రాంతంలో ఉన్న ఆడిటోరియానికి వచ్చే వారికీ ఇదే దుస్థితి తప్పడం లేదు. ఇటీవల రాత్రి వేళల్లో అనేక ప్రమాదాలు కూడా జరిగిన సందర్భాలు ఉన్నాయి. నీటి నిల్వ కారణంగా దుర్వాసన, దోమల సమస్యలతో పాటు విష కీటకాలు, పాముల సంచారం పెరిగిందని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నాయకత్వ లక్షణాలతో బహుముఖ లాభాలు

జగ్గయ్యపేట, : మహిళా సాధికారతకు పెద్దపీట వేసే పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ(మెప్మా)కు సారథ్యం వహించే టీఎల్ఎఫ్(పట్టణ సమాఖ్య) ప్రతినిధులకు నాయకత్వ లక్షణాలు ఉండాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ కర్లపాటి శ్రీనివాసరావు సూచించారు. నూతనంగా ఎన్నికైన టీఎల్ఎఫ్ కమిటీ ప్రతినిధులు నజీమూన్, గోనెల పద్మ, ఆనప పద్మ, ఆర్పీ లావణ్య, ట్రస్ట్ సిబ్బందికి సోమవారం తమ కార్యాలయంలో జరిగిన శిక్షణలో ఆయన పలు సూచనలు చేశారు. మహిళల జీవితాలను మార్చగల మెప్మాకు సారథ్యం వహించడం కీలకమైన విషయమని, నవీన ఆర్థిక విధానాలను అవగాహన చేసుకొని స్వశక్తి సంఘాలకు వాటిపై తర్ఫీదునివ్వాలని కోరారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

నందిగామ: తుపాన్ ప్రభావం వల్ల భారీవర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక పురపాలక సంఘ కమిషనర్ రమణబాబు తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో 24 గంటలు పాటు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అన్ని స్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. ఏ సమయంలో అవసరమైన తమను సంప్రదిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

మాగల్లు(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లులో ఆదివారం రాత్రి కనకదుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మదనగోపాలస్వామి మండపంలో అమ్మవారిని పూలరథంలో గ్రామోత్సవం చేశారు. నేలకొండపల్లి మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఒకటో వార్డులో కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవాన్ని సోమవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. వేదాద్రి వద్ద అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనోత్సవం చేశారు.



మాగల్లులో కనకదుర్గమ్మ



తూర్పుబజార్ దుర్గాదేవి ఊరేగింపు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : శరన్నవరాత్రులు ప్రత్యేక పూజలందుకున్న దుర్గాదేవి విగ్రహాలను సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జొన్నలగడ్డ గోపాలరావు దాన వీర శూర కర్ణ చిత్రంలోని దుర్యోధనుడి పాత్రను ఏకపాత్రాభినయం చేసి అందర్నీ అలరించారు.

భక్తితో అయ్యప్ప దీక్ష

కంచికచర్ల, న్యూస్‌టుడే: యాంత్రిక జీవనంలో జీవిత లక్ష్యాలను మరిచిపోతున్న మానవుల జీవన గమనాన్ని మార్చగలిగేదే అయ్యప్ప దీక్ష అని కె.పద్మనాభన్ నంబూద్రి పప్ప స్వామి(గురు స్వామి) అన్నారు. స్థానిక శివసాయి క్షేత్రంలో భక్తులకు అయ్యప్ప మండల దీక్షల మాలధారణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. శివసాయి క్షేత్రంలో మాలధారణలు, ఇరుముడి కార్యక్రమాలను ఏటా వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.



దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

మూడు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రవరం పంచాయతీ పరిధిలోని తాగునీటి పథకం వద్ద విద్యుత్తు నియంత్రిక కాలిపోయింది. ఇటీవల వర్షాలకు ఉరుములు, మెరుపులతో నియంత్రిక మరమ్మతుకు గురైంది. వైరా ఏటి ఒడ్డున ఉన్న మోటారు ద్వారా నీటిని గ్రామానికి సరఫరా చేస్తుంటారు. విద్యుత్తు నియంత్రిక మరమ్మతుకు గురవ్వడంతో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచింది. దీనిపై గ్రామ సచివాలయ కార్యదర్శి సతీష్‌ను వివరణ కోరగా విద్యుత్తు శాఖ సిబ్బంది నియంత్రికను పరిశీలించారని, మరమ్మతు చేయించి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.



కాలిపోయిన విద్యుత్తు నియంత్రిక

విజయవాడ పశ్చిమ

బందోబస్తు అధికారులు.. సిబ్బందికి సత్కారం


ఏడీసీపీ రాజారావుకు శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం ఇస్తున్న సీపీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రులు విజయవంతానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులను పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు అభినందనలు తెలిపారు. బందోబస్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూలా నక్షత్రం, విజయదశమి రోజున భక్తులు విపరీతంగా తరలివచ్చారని చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు, సిబ్బందికి కనకదుర్గమ్మ వారి శేషవస్త్రం, ఫొటో, లడ్డూ ప్రసాదం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు రక్షణ కల్పించండి


డీఆర్ఎంకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : రైల్వేస్టేషన్ పరిసరాల్లో రైల్వే కార్మికులకు రక్షణ కల్పించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన లోకో పైలెట్ ఎబినేజర్ ఘటనకు నిరసనగా సోమవారం రైల్వేకార్మిక సంఘాల ఆధ్వర్యంలో డీఆర్ఎం కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే లోకో పైలెట్‌ను అత్యంత కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రాంగణాల్లో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను అరికట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. హత్యకు గురైన లోకో పైలెట్ కుటుంబానికి రైల్వే శాఖ కోటి రూపాయిల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి యడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం డివిజనల్ అధ్యక్షుడు కె.రమేష్, మజ్దూర్ యూనియన్ రన్నింగ్ బ్రాంచి కార్యదర్శి ఎం.క్రాంతికుమార్, సీఐటీయూ నాయకుడు వి.వి.ఎల్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం వితరణ


సీతారామలక్ష్మి ఆలయంలో భోజనం చేస్తున్న భక్తులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో దసరా ఉత్సవాలు ముగిశాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగన్మాతా.. మమ్మ కరుణించమ్మా..!

వందల కిలోమీటర్లు నడిచి వస్తున్న భవానీలు

భవానీపురం, న్యూస్‌టుడే

ఇంద్రకీలాద్రిపై వెలసిన కనక దుర్గమ్మను దర్శించుకునేందుకు భవానీలు వందల కిలోమీటర్ల మేర నడుచుకుంటూ ఇక్కడకు వస్తున్నారు. కాళ్ల నొప్పులు... రక్తం వస్తున్నా పంటి బిగువన భరిస్తూ అమ్మ సన్నిధికి చేరుకుంటున్నారు. జగన్మాత దర్శనం తర్వాత గాయాలన్నీ మరిచిపోయి సంతోషంగా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇంద్రకీలాద్రికి వచ్చే మార్గాలన్నీ భవానీల నడకతో నిండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు భవానీలతో 'న్యూస్‌టుడే' మాట్లాడటం జరిగింది. వారి అభిప్రాయాలను ఒక్కసారి తెలుసుకుందాం.


చిన్నారులతో కలిసి వస్తున్న భవానీలు

250 కి.మీ దూరం నుంచి..




మాది జగ్గంపేట మండలంలోని నీలాద్రపుపేట. నేను రోజు వారీ పనులకు వెళ్తుంటాను. కొంతకాలంగా నా భార్యకు ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. దీంతో అమ్మవారి మాల వేసుకొని ఇంటి నుంచి ఇంద్రకీలాద్రికి నడుచుకుంటూ వస్తానని మొక్కుకున్నా. ఆ ప్రకారం ఇక్కడకు వచ్చి అమ్మవారి దర్శనం చేసుకోవడం జరిగింది. దాదాపు 250 కి.మీ మేర నడిచాను. దీనికి ఐదు రోజులు సమయం పట్టింది. **-జయన్న, జగ్గంపేట**

కృత నిశ్చయంతో ముందుకు సాగాం..



ఇంద్రకీలాద్రికి నడుచుకుంటూ రావడం ఇదే మొదటిసారి. ఆరంభంలో నడవలేమో అని అనుకున్నాం. ఏదో విధంగా వెళ్లి దుర్గమ్మను దర్శించుకోవాలనే కృత నిశ్చయంతో నడక సాగించాం. ఇక్కడకు రావడం సంతోషంగా ఉంది. అమ్మ కృపతోనే నడుచుకుంటూ వచ్చాం. దర్శనం బాగా జరిగింది. **-శ్రీను, రామకృష్ణ, రాజమహేంద్రవరం**

అమ్మ కృపతో..



నేను ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాను. నాకున్న సమస్యలు తీరాలంటూ జగన్మాతకు మొక్కుకున్నాను. ఆ ప్రకారం నడుచుకుంటూ ఇక్కడకు వచ్చాను. ఇంద్రకీలాద్రికి చేరుకోవడానికి ఐదు రోజులు పట్టింది. కాళ్ల నొప్పులు విపరీతంగా బాధించాయి. అయినా లెక్క చేయకుండా ముందుకు సాగాను. అమ్మవారి దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉంది. రోజుకు సుమారు నలభై కి.మీ మేర నడిచాను. **-నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం**

భక్తుల సహకారం మరువలేం..



నేను వ్యవసాయ పనులు చేస్తుంటాను. నడుచుకుంటూ కనక దుర్గమ్మను దర్శించుకోవాలని మొక్కుకోవడం జరిగింది. ఆ మేరకు నడక ప్రారంభించాను. మూడు రోజుల్లో ఇంద్రకీలాద్రికి చేరుకున్నాను. మార్గ మధ్యలో భక్తులు సాయం చేశారు. అల్పాహారం, భోజనం, పండ్లు తదితర వాటిని అందించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కూడా భవానీలు నడుచుకుంటూ వచ్చారు. **-పెద్దిరాజు, భీమడోలు**

బాధలన్నీ పోయాయి...



నేను పెయింటింగ్ పనులు చేస్తుంటాను. నడుచుకుంటూ అమ్మ దర్శనానికి రావాలనే ఉద్దేశంతో వచ్చాను. మొదట్లో మూడు వందల కిలోమీటర్లు నడవగలనా అని అనుకున్నా. ప్రతిరోజు యాభై కి.మీ వరకు నడిచాను. మధ్యలో శారీరకంగా కొన్ని ఇబ్బందులు ఎదురైనా లెక్క చేయకుండా ముందుకు సాగాను. దుర్గమ్మ దర్శనంతో బాధలన్నీ పోయాయి. మొదటి సారి అయినప్పటికీ ఆరు రోజుల్లో నడుచుకుంటూ అమ్మ దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉంది. **-లక్ష్మణరావు, అనకాపల్లి**

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి


స్నానఘాట్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య నిర్వహణలో ఏ విధమైన లోపం లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరంలోని కృష్ణవేణి ఘాట్, అన్నక్యాంటీన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఘాట్ వద్ద భక్తులు విడిచి పెట్టే దుస్తులను ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. పటమట హైస్కూలులో ఉన్న అన్నక్యాంటీన్‌ను పరిశీలించి ప్లేట్లను శుభ్రం చేయాలని, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. నీటి సౌకర్యం ఉండేలా చూడాలని కోరారు.

★ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కమిషనర్ అన్నారు. నగరంలోని 8వ డివిజన్ సిద్ధార్థనగర్ ప్రాంతంలో ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కాలువల్లో పూడిక తొలగించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.

క్రైం డీసీపీ బాధ్యతల స్వీకరణ


తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా ఆయన్ని ఎన్టీఆర్ కమిషనరేట్‌కు కేటాయించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క బహూకరించారు.

నూతన ఆవిష్కరణలపై పట్టు అవసరం


కార్యశాలలో మాట్లాడుతున్న రామ్‌కిరణ్‌గుప్తా

చిట్టినగర్, న్యూస్‌టుడే : విద్యార్థులు తమ తమ రంగాల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలని సీనియర్ డేటాబేస్ ఎనలిస్ట్ అండ్ ఇంజినీర్ రామ్‌కిరణ్‌గుప్తా అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో డేటాబేస్ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలు- సమస్యలు అనే అంశంపై కార్యశాల సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డేటాబేస్ రంగంలో నూతన అంశాలు ముందుకు వస్తున్నాయని, అందులో భాగంగా మంగోడీబీ అట్లాస్ సాఫ్ట్‌వేర్‌తో వ్యాపార రంగంలో నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. డేటాసైన్స్ విద్యార్థులు డేటా ఎనలైజ్ చేయడానికి అందుబాటులో ఉన్న అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. పలు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లర నాణేల కొరత పరిష్కరించేందుకు కృషి


వినియోగదారుడికి నాణేలు అందిస్తున్న ఆనంద్ కుమార్, బ్యాంకు ప్రతినిధులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : వ్యాపార వర్గాలు చిల్లర నాణేల కొరత సమస్యను పరిష్కరించేందుకు మేళాలను వినియోగించుకోవాలని కెనరా బ్యాంకు విజయవాడ రీజనల్ మేనేజరు జి.ఎన్.బి ఆనంద్ కుమార్ కోరారు. పాతబస్తీ సామారంగం చౌక్‌లోని కెనరా బ్యాంకు సమీపంలో ఏర్పాటు చేసిన మేళాలో రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారులు చిన్న చిన్న అవసరాల కోసం చిల్లర సమస్య లేకుండా ఉండేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. రూ.10 నాణేలపై కొందరికి అపోహలు ఉన్నాయని వాటిని తొలగించుకోవాలని సూచించారు. రిజర్వు బ్యాంకు వాటిని అందరూ వినియోగించుకునేందుకు ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు.

బాధితులకు పౌష్టికాహారం పంపిణీ


కిట్లు అందుకున్న వారితో నిర్వాహకులు

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక నీతోడు మానసిక వికాస కేంద్రంలో సోమవారం బాధిత కుటుంబాలకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఫాదర్ మిల్కియర్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో అనేక వ్యాధులు వస్తాయని ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రోగ్రాం మేనేజరు ఎం.డి.వసంతకుమారి, ప్రసన్న, జ్యోత్స్న, సునీత, మాధురి, రిబ్కా, రమ్య, రేవతి, రాజ్యలక్ష్మి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ర్యాంపు నిర్మాణం చేయాలని సంతకాల సేకరణ

చిట్టినగర్, న్యూస్‌టుడే : ర్యాంపు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ప్రమాదకరంగా మారిన 50వ డివిజన్‌లోని టెట్రాపిళ్లై స్వామి వీధిలో ర్యాంపు నిర్మాణం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడం వల్ల కొండప్రాంత ప్రజలు జారిపడిపోతున్నారన్నారు. ఈ సమస్యపై పలుమార్లు నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఇసుక కొరత, బిల్లులు కావడం లేదనే కారణాలను చూపించి వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ ఇలా.. మురుగు పారేదెలా?

విద్యాధరపురం, న్యూస్‌టుడే


పొంగి రహదారి మీద పారుతున్న నీరు

పాత రాజరాజేశ్వరిపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. రెండు దశాబ్దాల కాలం కిందట నిర్మించిన కాల్వల నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఇటీవల వచ్చిన బుడమేరు వరదకు ఈ ప్రాంతం భయానకంగా తయారైంది. వరద నీరు బయటకు వెళ్లినప్పటికీ పారిశుద్ధ్య పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోరు మునిగిపోయి రెండు వారాల పాటు జనజీవన స్రవంతికి పలు కుటుంబాలు దూరమయ్యాయి. అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు మాత్రం ఇంత వరకు ప్రారంభించ లేదు. ఈ ప్రాంతంలో భూగర్భ డ్రెయినేజీ నీరు పొంగి రోడ్డు మీదకు చేరుతోంది అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది.

విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం



ఈ ప్రాంతంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టక పోవడంతో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. బుడమేరు వరద వచ్చిన తర్వాత కూడా పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎమ్మెల్యే, కార్పొరేటరుకు ఈ పరిస్థితిపై స్థానికులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కనీసం వరద సాయం కూడా సక్రమంగా అందక పేద, మధ్య తరగతి వర్గాలు అల్లాడారు. **-బాషా**

నీరు బయటకు వెళ్లడం లేదు



పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. డ్రెయిన్లు నిర్మాణం సరిగా చేపట్టక పోవడంతో నివాసాల్లో వాడిన నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మురుగు రోడ్డు మీదనే తిష్ఠ వేస్తోంది. ఇటీవల వచ్చిన బుడమేరు వరద ఈ ప్రాంతవాసులు మరచిపోలేం. గతంలో ఎన్నడూ లేనంతగా నీటిలో ఈ ప్రాంతం నానిపోయింది. డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులు దృష్టి పెట్టాలి. **-రమేష్**

డివిజన్ అభివృద్ధికి ప్రతిపాదనలు

56 డివిజన్ అభివృద్ధికి పలు ప్రతిపాదనలు కౌన్సిల్లో పెట్టాం. ప్రధానంగా రోడ్లు, కాల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేశాం. లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం, వరదలు వచ్చినప్పుడు తలెత్తే సమస్యలను పరిగణనలోకి తీసుకొని డ్రెయినేజీ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నాం.

- యలకల చలపతిరావు, 56 డివిజన్ కార్పొరేటరు

రతన్ టాటా మృతి ప్రపంచానికే తీరని లోటు


శ్రద్ధాంజలి కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, వెంకట్రావు తదితరులు

పటమట, న్యూస్‌టుడే : రతన్ టాటా మృతి కేవలం దేశానికే కాదని ప్రపంచానికి తీరని లోటని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, జె.ఆర్.డి టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో గంగరాజు మాట్లాడుతూ రతన్ టాటా విలువలకు, నీతి నిజాయతీకి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. తన ఆదాయంలో సగానికి పైగా సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంతో ప్రజల మనసులోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థులు నేరుగా ప్రవేశం లభించాలన్నదే రతన్ టాటా లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ అధ్యక్షుడు బాయిన వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : హిమాచల్‌ప్రదేశ్‌లోని నాగ్రోత్ బాగ్వాన్‌లో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర లిఫ్టర్ల బృందం పలు ట్రోఫీలు కైవసం చేసుకున్నాయని సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.దీన్నాబాబు తెలిపారు. యూత్ బాలబాలికల విభాగాలతో పాటు జూనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో టీమ్ ఛాంపియన్‌షిప్పులను సొంతం చేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్తా చాటిన లిఫ్టర్లను పలువురు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భవానీపురం: 8008574638

స్పందనకు వందనం

★ బైపాస్ రహదారి, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు పక్కన మద్యం దుకాణాల వద్ద మందుబాబులు గొడవలకు దిగుతున్నారంటూ స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను సీఐ ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందిని పంపి మందుబాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

★ విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ వద్ద కొండ ప్రాంతంలో తాగునీరు లీకేజీ అవుతుందంటూ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా నీటి సరఫరా విభాగం ఏఈ అహ్మద్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

★ భవానీపురం ప్రియదర్శిని కాలనీలోని రహదారులు గతుకులుగా ఉన్నాయంటూ ఈఈ ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు.

★ భవానీపురం దర్గా ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉందంటూ స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు తెలుపగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

★ జక్కంపూడి కాలనీలో చెత్త సేకరణ, వ్యర్థాలను తొలగించడం లేదంటూ నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేయగా కార్మికులను పంపి వాటిని తొలగింపజేశారు.

★ కబేళా కూడలి వద్ద వాహనాలు అస్తవ్యస్తంగా వెళ్తున్నాయని, దీంతో ట్రాఫిక్ నిలిచిపోతుందంటూ ట్రాఫిక్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అక్కడ సిబ్బందిని నియమించారు.

-న్యూస్‌టుడే, భవానీపురం

సీవీఆర్ వంతెనకు నూతన శోభ

గోతులకు మరమ్మతులు

చిట్టినగర్, న్యూస్‌టుడే


వారధిపై పూడ్చిన గుంతలు


బొమ్మలతో సుందరంగా కన్పిస్తున్న గోడ

పాల ఫ్యాక్టరీ సమీపంలోని చనమోలు వెంకట్రావు పైవంతెన నూతన శోభను సంతరించుకుంది. దీనిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో దానిపై పలుచోట్ల గోతులు పడి చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వంతెన గోడలు, ఫుట్‌పాత్‌లు అధ్వానంగా ఉన్నాయి. గత ప్రభుత్వం వంతెన బాగోగులు పట్టించుకోలేదు. ఆయా సమస్యలపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురించడంతో స్పందించిన కూటమి ప్రభుత్వం అధికారులు ప్రమాదాలకు తావు లేకుండా గుంతలకు మరమ్మతులు చేపట్టారు. వంతెన గోడలకు, ఫుట్‌పాత్‌లకు రకరకాల బొమ్మలతో రంగులు తీర్చిదిద్దారు. దీంతో వారధి చూడముచ్చటగా దర్శనమిస్తుంది.

నగర మహాసభ విజయవంతం చెయ్యండి

చిట్టినగర్, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని భవిష్యత్తు ప్రణాళిక కోసం నగర మహాసభలో చర్చించనున్నట్లు ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, సాంబశివరావు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ 48వ డివిజన్‌లో మున్సిపల్ కార్మికులతో కార్నర్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈనెల 24న గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే నగర సభకు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జూదం ఆడుతున్న 24 మంది అరెస్టు

భవానీపురం, న్యూస్‌టుడే : జూదం ఆడుతున్న వారిని భవానీపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి...భవానీపురం స్టేషన్ పరిధిలోని బైపాస్ రహదారి పక్కన ఒక గోదాములో జూదం ఆడుతున్నట్లుగా పోలీసులకు సోమవారం సమాచారం వచ్చింది. దీంతో శిబిరంపై దాడి చేసి 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.52 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తమామలపై అల్లుడి దాడి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆస్తి తగాదాల విషయంలో పిల్లనిచ్చిన అత్తమామలపై అల్లుడు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన తిరుపతి జిల్లా గూడూరు ఇందిరానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యంతో కొన్నేళ్ల కిందట వివాహం చేశారు. ఈ క్రమంలో అల్లుడు సుబ్రహ్మణ్యం, అత్తమామలకు ఆస్తి విషయంలో తరచూ గొడవ జరిగేది. ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం, అతని బంధువులు నలుగురు ఇందిరానగర్‌కి వచ్చి కృష్ణారావు, ధనలక్ష్మితో ఘర్షణ పడి ఇనుప రాడ్డుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

అంబాపురం సర్పంచిపై వీఆర్వో ఫిర్యాదు

చిట్టినగర్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ ప్రాంతంలోని అంబాపురం సర్పంచిపై ఓ మహిళా వీఆర్వో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబాపురం వీఆర్వోగా బుద్దంటి అరుణాదేవి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో వరద బాధితులకు బియ్యం అందించేందుకు మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి తన ట్రస్టు ద్వారా గ్రామస్థులకు 10 కిలోల చొప్పున బియ్యం సంచులు ఈ నెల 8న లారీలో పంపించారు. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు బాధితులు 650 మందికి వాటిని పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో సర్పంచి గండికోట సీతయ్య జోక్యం చేసుకుని పంపిణీ చేయవద్దని, తాను చెప్పిన చోట ఇవ్వాలని ఫోన్‌లో దుర్భాషలాడారని, పై అధికారుల ఆదేశాల మేరకే తాను పంపిణీ చేస్తున్నానని చెప్పినా వినకుండా మహిళ అని కూడా చూడకుండా అవమానకరంగా మాట్లాడారని, తమ విధులకు ఆటంకం పరిచారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీతయ్య అనుచరుడైన దొండపాటి హరీష్ దొంగచాటుగా ఫొటో తీసి విధులు సరిగా నిర్వహించడం లేదని తన ఫొటోను అందరికి పంపించి తన పరువుకు భంగం కలిగించారని వివరించారు. ఈ మేరకు కొత్తపేట పోలీసులు విచారించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

యోగాలో పసిడి పతకం


క్రీడాకారిణి జ్యోత్స్నాదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమేష్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన యోగా క్రీడాకారిణి జి.జ్యోత్స్నాదేవి మెరుగైన ప్రతిభ ప్రదర్శించి ట్రోఫీ, పతకాలు కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపల్ ఎం.రమేష్ తెలిపారు. ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్‌లో జ్యోత్స్నాదేవి ఎన్టీఆర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆర్టిస్టిక్ యోగాలో పసిడి, ట్రెడిషనల్ యోగాలో కాంస్య పతకాలు సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు విద్యార్థినిని అభినందించారు.

విజయవాడ మధ్య

? గుణదల ప్రశాంత్ కాలనీ శ్రీసాయి నిలయం వద్ద వరదలకు కొట్టుకొచ్చిన చెత్తను ఇప్పటికీ తొలగించలేదు. స్థానికులు కూడా వ్యర్థాలు తెచ్చి వేస్తున్నారు. వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. - చిరంజీవి, స్థానికుడు

✔ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.
- వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ

- న్యూస్‌టుడే, సీతారాంపురం

పౌష్టికాహారం పంపిణీ

పెజ్జోనిపేట: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక నీతోడు మానసిక వికాస కేంద్రంలో సోమవారం బాధిత కుటుంబాలకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. ఫాదర్ మిల్కియర్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో అనేక వ్యాధులు వస్తాయని ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

క్రైం డీసీపీ బాధ్యతల స్వీకరణ


తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీ కె.తిరుమలేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా ఆయన్ని ఎన్టీఆర్ కమిషనరేట్‌కు కేటాయించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క బహూకరించారు.

బందోబస్తు అధికారులు.. సిబ్బందికి సత్కారం


ఏడీసీపీ రాజారావుకు శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రులు విజయవంతానికి కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు అభినందనలు తెలిపారు. బందోబస్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూలా నక్షత్రం, విజయదశమి రోజున భక్తులు విపరీతంగా తరలివచ్చారని చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు, సిబ్బందికి కనకదుర్గమ్మ వారి శేషవస్త్రం, ఫొటో, లడ్డూ ప్రసాదం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నీరు నిల్వ.. వ్యాధుల భయం..!

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే


చెరువులా కనిపిస్తున్న రైల్వే స్థలం


కూలిపోయిన రక్షణ గోడ

బుడమేరుకు వరద వచ్చి నెలన్నర గడిచినా పైపులరోడ్డు, వాంబేకాలనీ మధ్యలోని రైల్వే స్థలంలో నీళ్లు పోలేదు. ఇంకా చెరువును తలపిస్తోంది. గత నెల 1వ తేదీన వచ్చిన వరద ఉద్ధృతికి వాంబేకాలనీలోని 25 ఎకరాల రైల్వేస్థలంలో భారీగా నీరు చేరింది. గతంలో విజయవాడ నగరం మీదుగా వెళ్లే సత్యనారాయణపురం రైల్వేలైనును తొలగించి.. ఈ స్థలాన్ని రైల్వేశాఖ నగరపాలక సంస్థకు ఇచ్చింది. దానికి ప్రతిగా నగరపాలక సంస్థ.. వాంబేకాలనీ వద్ద 25 ఎకరాల స్థలాన్ని రైల్వేశాఖకు అప్పగించింది. అందులో నీరు నిల్వ ఉండడంతో వ్యాధులు ప్రబలుతాయేమోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

దోమల వ్యాప్తి

వాంబేకాలనీ, దాని పరిసర ప్రాంతాల్లో నిరుపేదలే నివసిస్తున్నారు. చెరువులా మారిన రైల్వే స్థలం దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిపోతోందని స్థానికులు భయపడుతున్నారు. తాజా తుపాను నేపథ్యంలో.. మరిన్ని వర్షాలు పడితే మళ్లీ నీరు చేరుతుంది. ఉన్ననీరు ఇకండానికి, ఆవిరవడానికి మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పటి వరకు దోమల భయం తప్పదని ఆందోళన చెందుతున్నారు. డ్రోన్ల ద్వారా నిరంతరం దోమల నివారణ మందు పిచికారీ చేస్తే కొంతమేర ప్రయోజనం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా


అతిథుల నుంచి ట్రోఫీ అందుకుంటున్న రాష్ట్ర లిఫ్టర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : హిమాచల్‌ప్రదేశ్‌లోని నాగ్రోత్ బాగ్వాన్‌లో ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు జరిగిన జాతీయ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర లిఫ్టర్ల బృందం పలు ట్రోఫీలు కైవసం చేసుకున్నాయని సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.దీన్షాబాబు తెలిపారు. యూత్ బాలబాలికల విభాగాలతో పాటు జూనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో టీమ్ ఛాంపియన్‌షిప్పులను సొంతం చేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్తా చాటిన లిఫ్టర్లను పలువురు అభినందించారు.

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి


స్నానఘాట్‌ల వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య నిర్వహణలో ఏ విధమైన లోపం లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరంలోని కృష్ణవేణి ఘాట్, అన్నక్యాంటీన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఘాట్ వద్ద భక్తులు విడిచి పెట్టే దుస్తులను ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. పటమట హైస్కూలులో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ప్లేట్లను శుభ్రం చేయాలని, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. నీటి సౌకర్యం ఉండేలా చూడాలని కోరారు.

★ వర్షాలు పడే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కమిషనర్ అన్నారు. నగరంలోని 8వ డివిజన్ సిద్ధార్థనగర్ ప్రాంతంలో ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కాలువల్లో పూడిక తొలగించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు.

అమ్మ భక్తుల ఆకలి తీరె..!


ప్రజాశక్తినగర్‌లో వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్, న్యూస్‌టుడే : గత పది రోజులుగా నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రులు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం నగరంలోని పూజా మందిరాల్లో భారీగా అన్నదానాలు నిర్వహించారు. 64వ డివిజన్ ప్రజాశక్తినగర్‌లో కనకదుర్గ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 3వేల మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు నవనీతం సాంబశివరావు, పలగాని శివ, రవికుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఊరేగింపు

మధురానగర్ పైవంతెన వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 5వేల మందికి అన్నదానం చేశారు. కమిటీ సభ్యులే భక్తులకు, ప్రజలకు భోజనాలు వడ్డించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలకరించిన రథంపై.. అమ్మవారి ఉత్సవ విగ్రహం నిలబెట్టారు. భేతాళ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మధురానగర్ పురవీధుల్లో ఊరేగించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


మధురానగర్‌లో దుర్గమ్మ ఊరేగింపు రథం


అమ్మవారి ఉత్సవ విగ్రహం

ఘనంగా పుణ్యతిథి ఉత్సవాలు

దుర్గాపురం (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : దుర్గాపురంలోని కోదండ రామాలయ ప్రాంగణంలోని బాబా మందిరంలో శిర్డీ సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు సందర్భంగా.. సోమవారం బాబాను పలు రకాల కూరగాయలు, ఆకు కూరలతో అందంగా అలంకరించారు. మందిర ఆవరణలో దీపాలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు.


ఆకుకూరలు, కాయగూరలతో బాబా అలంకరణ


విద్యుద్దీపాల వెలుగులో మందిరం

జ్యోత్స్న సేవలు నిరుపమానం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : బార్ కౌన్సెల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న అకాల మరణానికి చింతిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. బీబీఏ హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్, సీనియర్ న్యాయవాదులు వి.గురునాథం, పిళ్లా రవి, ఎ.రాంప్రసాద్ తదితరులు జ్యోత్స్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. అందించిన సేవలు నిరుపమానమని పేర్కొన్నారు. ఆమె అకాల మరణం మహిళా లోకానికి తీరని లోటని చెప్పారు.


నివాళులర్పిస్తున్న చంద్రమౌళి, శివరామ ప్రసాద్, గురునాథం, రవి తదితరులు

పెట్టుబడులపై అవగాహన

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలికల)లో ప్రపంచ పెట్టుబడుల వారోత్సవాలు పురస్కరించుకొని సోమవారం పెట్టుబడులపై అవగాహన సదస్సు నిర్వహించామని ప్రిన్సిపల్ వి.నీరజ తెలిపారు. ఎస్సారార్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు ఓలేటి అచ్యుత రామ కిషోర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పెట్టుబడులు పెట్టడంలో మెలకువలు, పొదుపు సేవలు, స్టాక్ మార్కెట్లు, ద్రవ్యోల్బణం, షేర్లు, బాండ్లు, మ్యూచువల ఫండ్ల గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు సుధారాణి, సత్యవాణి, బాలకృష్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో ప్రమాద ఘంటికలు!

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే


శాంతినగర్ నుంచి వచ్చే దారిలో స్తంభం


మరో రోడ్డులో హైటెన్షన్ విద్యుత్తు లైన్

అజిత్‌సింగ్‌నగర్ పైపులరోడ్డు నుంచి శాంతినగర్‌కు వెళ్లే రహదారుల మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. నూజివీడు రోడ్డు నుంచి డిస్నీ ల్యాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారి పైపుల రోడ్డు. నిత్యం వేలాది వాహనాలు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీని నుంచి శాంతినగర్‌లోకి వెళ్లేందుకు అంతర్గత రహదారులు ఉన్నాయి. ఈ దారుల్లో వేసిన విద్యుత్తు స్తంభాలు.. మధ్యలోకి వచ్చేశాయి. ఇక్కడ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.

కొత్తవారు వస్తే..

శాంతినగర్ నుంచి పైపుల రోడ్డులోకి వెళ్లేందుకు రహదారులు ఉన్నాయి. వెడల్పుగా ఉండేవి. వీటి మధ్యలోకి వచ్చేలా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. రాకపోకలు సాగించే మార్గం.. చిన్నగా మారిపోయింది. రోడ్డును పూర్తిగా వినియోగించుకోకపోవడంతో.. కొంత మేర నిరుపయోగంగా మారిపోయింది. రాత్రి వేళ కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చిన వారికి.. స్తంభాలు కనిపించక ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఒక వీధి మొదట్లో.. హైటెన్షన్ విద్యుత్తు స్తంభం అడ్డుగా ఉంది. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే విద్యుత్తు అధికారులు స్పందించి.. స్తంభాలను రోడ్డు అంచుకు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీల గొంతుక.. ప్రొఫెసర్ సాయిబాబా

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఆదివాసీల గొంతుక ప్రొఫెసర్ సాయిబాబా అని, ఆయన మరణం తీరని లోటని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు అన్నారు. సోమవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోనసీమ ప్రాంతంలో పుట్టిన సాయిబాబా ఉన్నత చదువులు చదివారని, దిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేశారని తెలిపారు. అభ్యుదయ, ప్రగతిశీల భావాలను పెంపొందించుకొని సమాజ మార్పు కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. పీడిత ప్రజానీకంపై సాగుతున్న దోపిడీ, సామ్రాజ్యవాద, భూస్వామ్య విధానాలను ప్రశ్నించారని గుర్తు చేశారు. మవోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే కల్పిత కథలు సృష్టించి.. 90 శాతం వైకల్యం ఉన్నా కనికరం లేకుండా అరెస్టు చేశారని విమర్శించారు. పదేళ్ల పాటు జైల్లో మగ్గేలా చేశారని మండిపడ్డారు. పీడిత ప్రజల విముక్తి కోసం పని చేయడమే సాయిబాబాకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు కె.రవీంద్ర, మీరావలి, బాజీ, రాజు, సుబ్బారావు, జి.శ్రీను, సిరిచందన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రం ఆరంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు. పక్కన మనోహర్‌కుమార్, హనుమంతరావు, శ్రీనివాసరావు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి.. వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం గవర్నర్‌పేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టభద్రులు తమ డిగ్రీ ధ్రువీకరణపత్రం, ఓటరు గుర్తింపు కార్డు ఇచ్చి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కుమార్, ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, కోశాధికారి పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి తీరని లోటు


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, బాయిన వెంకట్రావు తదితరులు

పటమట, న్యూస్‌టుడే : రతన్ టాటా మృతి కేవలం దేశానికే కాదని ప్రపంచానికి తీరని లోటని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, జె.ఆర్.డి టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రతన్ టాటాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో గంగరాజు మాట్లాడుతూ రతన్ టాటా విలువలకు, నీతి నిజాయతీకి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. తన ఆదాయంలో సగానికి పైగా సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంతో ప్రజల మనసులోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. విదేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థులు నేరుగా ప్రవేశం లభించాలన్నదే రతన్ టాటా లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ అధ్యక్షుడు బాయిన వెంకట్రావు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

అత్తమామలపై అల్లుడి దాడి

గూడూరు పట్టణం: ఆస్తి తగాదాల విషయంలో పిల్లనిచ్చిన అత్తమామలపై అల్లుడు విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన తిరుపతి జిల్లా గూడూరు ఇందిరానగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రహ్మణ్యంతో కొన్నేళ్ల కిందట వివాహం చేశారు. ఈ క్రమంలో అల్లుడు సుబ్రహ్మణ్యం, అత్తమామలకు ఆస్తి విషయంలో తరచూ గొడవ జరిగేది. ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యం, అతని బంధువులు నలుగురు ఇందిరానగర్‌కి వచ్చి కృష్ణారావు, ధనలక్ష్మితో ఘర్షణ పడి ఇనుప రాడ్డుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

కృష్ణుడి విగ్రహం మాయం


చోరీకి గురైన కృష్ణుడి విగ్రహం (పాత చిత్రం)


దిమ్మె, ఆవు మాత్రమే మిగిలాయిలా..

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : వాంబేకాలనీ సి బ్లాక్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కృష్ణుడి విగ్రహం మాయమైంది. సోమవారం ఉదయం స్థానికులు ఈ విషయాన్ని గమనించారు. వెంటనే నున్న పోలీసులకు సమాచారం అందించారు. దేవాలయాల్లో చోరీలకు పాల్పడే వారే.. ఇలా చేసి ఉండొచ్చని ప్రజలు అనుమానిస్తున్నారు. ఘటనపై హిందూ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దేవుడు విగ్రహాలను దొంగిలించే స్థితి ఏర్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నున్న సీఐ కృష్ణమోహన్ విచారణ చేపట్టారు. రాత్రి వేళ అనుమానితులు ఎవరైనా ఈ ప్రాంతంలో సంచరించారా.. అనే విషయాన్ని ఆరా తీశారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

చరవాణి గుంజుకుని పరారీ

మధురానగర్, న్యూస్‌టుడే : మధురానగర్ వి.వి.నరసరాజురోడ్డులో ఉదయం నడకకు వెళుతున్న గడిపూడి రాజేంద్రప్రసాద్‌రావు (70) అనే వృద్ధుడి చేతిలో నుంచి ముగ్గురు యువకులు చరవాణి గుంజుకుని పరారయ్యారు. లెక్చరర్స్‌కాలనీకి చెందిన రాజేంద్రప్రసాద్‌రావు.. తెల్లవారుజామున 4.50 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరారు. వి.వి.నరసరాజురోడ్డులో అమ్మవారి పందిరి వద్దకు రాగానే ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు.. అతని చరవాణిని లాక్కుని పరారయ్యారు. దీనిపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు.

నగదు, నగలు మాయం

మధురానగర్ బావిరోడ్డులోని ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. బీరువాలో రూ.20వేల నగదు, 8 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. కొప్పుల ఆనంద్‌బాబు మధురానగర్ బావిరోడ్డులో ఉంటారు. ఆదివారం రాత్రి 11 గంటలకు కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోయారు. సోమవారం లేచి చూడగా.. బీరువాలోని నగదు, నగలు కనిపించలేదు. ఆయన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘తిరువూరు ఎమ్మెల్యేపై చర్యలేవి?’

విజయవాడ (గాంధీనగర్) : తిరువూరు నియోజకవర్గంలో నియంతగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై ఏం చర్యలు తీసుకున్నారని జైభీమ్‌రావు భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం ఆయన గాంధీనగర్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలకు అసభ్య సందేశాలు పెడుతూ, ఎవరిని పడితే వారిని బూతులు తిడుతున్న కొలికపూడిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇదే తరహాలో రాయలసీమకు చెందిన ఓ ఎమ్మెల్యే.. ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆమెను బెదిరించి కేసు రాజీ చేయించారని విమర్శించారు. పిఠాపురంలో ఓ తెదేపా నాయకుడు.. ఓ యువతిపై అత్యాచారం చేస్తే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎందుకు మాట్లాడలేదని అడిగారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా విస్మరించారని విమర్శించారు.

3న ఈత పోటీలు

విజయవాడ క్రీడలు: నగరంలోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో వచ్చే నెల 3వ తేదీన సౌత్ జోన్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఈత పోటీలు నిర్వహిస్తామని ఆయా జిల్లా సంఘాల కార్యదర్శులు ఐ.రమేష్, వి.వినోద్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆసక్తిగల స్విమ్మర్లు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు జాతీయ స్విమ్మింగ్ సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)యూఐడీతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ గుర్తింపు కార్డు లేని పోటీలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 79895 34719 (ఎన్టీఆర్ జిల్లా), 91607 66070 (కృష్ణా జిల్లా) నంబర్లలో సంప్రదించాలన్నారు.

పాస్టర్లకు చేయూత


దుప్పట్లు పంపిణీ చేస్తున్న డానియేల్, జోసెఫ్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వరద ముంపునకు గురై నష్టపోయిన పాస్టర్లను ఆదుకునేందుకు పలువురు క్రైస్తవ మత పెద్దలు ముందుకు వచ్చారు. జేకేసీ జువాలజీ ప్రొఫెసర్ కత్తి డానియేల్ ఆధ్వర్యంలో సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లో సమావేశం నిర్వహించారు. ఇబ్బందుల్లో ఉన్న పాస్టర్లకు ఆర్థిక సాయం, దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ మంగళపూడి జోసెఫ్, కోలా డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి కృషి

నున్న(రామవరప్పాడు), న్యూస్‌టుడే: కాపుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన అత్తులూరి జస్వంత్ కుమార్ అన్నారు. సోమవారం విజయవాడ రూరల్ నున్న కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్తగా అత్తులూరి జస్వంత్ కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రకటించారు. అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రకటించాలన్నారు. సంఘం నాయకులు విక్రమ్ మోహన్, తుంపాల వరప్రసాద్, తమ్ముల సాంబశివరావు, పూతి రాజశేఖర్, కొప్పిశెట్టి దుర్గారావు, కోలా రమేష్ పలువురు పాల్గొన్నారు.

మధురం.. సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : ‘నా నేస్తం’ మ్యూజికల్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కౌత కళా వేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. పలువురు గాయకులు తెలుగు చిత్రాల్లోని పాటలను శ్రావ్యంగా ఆలపించారు. టి.శ్రీనివాసరెడ్డి, చింతకాయల చిట్టిబాబు, దేవిడ్‌రాజు, వీరభద్రరావు తదితరులు అతిథులుగా హాజరయ్యారు. సంస్థ అధ్యక్షుడు నాగభూషణం, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.